# మిసిమి

మాస పత్రిక

జనవరి - 2004



రూ. 8/-



**మేరీ, మార్తాల గృహంలో క్రీస్తు**


వెర్మీర్ చిత్రించిన తొలి చిత్రాలలో మిగిలి ఉంది ఇదొక్కటే. అసలతడు బైబిల్ సంబంధ చిత్రాలను చిత్రించింది ఇదొక్కటే. కాంతిని, ప్రశాంతతని సహజ భంగిమలను చాలా సున్నితంగా స్పృశించాడు.



## ఐ. వెర్ - మీర్

**(1632-1675)**

డచ్ కళాకారులలోకెల్ల సర్వకాల ప్రసిద్ధుడు.
అయినా అతడి జీవితం అప్రసిద్ధంగానే ముగిసింది.
అతడు ఎక్కువగా చిత్రాలనూ వేయలేదు.
1632లో హాలెండ్ డెల్ఫ్ట్‌లో పుట్టాడు.
1653లో కేథరీనా బోల్‌నెస్‌తో వివాహమైంది.
1675లో డెల్ఫ్ట్‌లో మృతి చెందాడు.



వాన్ మీజెరెన్ అనుకరణ చిత్రాలు వెర్మీర్ అనుకరణల కనుకరణలేనా? 1937లో మార్కెట్‌లోకి వచ్చిన "ఇమాస్ యాత్రికులు" అనే చిత్రం వెర్మీర్ చిత్రించింది. కాని దానిని తాను చిత్రించినట్లు ఒక అజ్ఞాత చిత్రకారుడు హాన్స్‌వాన్ మీజెరెన్ ప్రకటించుకొన్నాడు. అయితే కళాభిజ్ఞులు అతడి ప్రకటనను కొట్టి వేశారు, అతనిని పరీక్షించిన తరవాత.

పూర్తి వ్యాసం 18వ పేజీలో చూడగలరు.

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 | జనవరి 2004 | సంచిక 1

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక


ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - I - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఇస్మాయిల్ సంస్మరణ - శివలింగం

పాల్ జోహన్ లుడ్విగ్ హేస్ మూలం : సి. డి. ఆఫ్ విర్సెన్
అనువాదం : బి.వి. రామిరెడ్డి

విషమ పర్యావరణం నేటి మానవాళి సమస్య- చర్చించిన నవల దృశ్యాదృశ్యం - ప్రొ॥ పురుషోత్తమ రెడ్డి

డచ్ చిత్రకారుడు వెర్మీర్ ఒకనివాళి - కాండ్రేగుల నాగేశ్వరరావు

కాలుష్యం - ఎదురవుతున్న ప్రమాదాలు - నివారణలు - సి.వి. సర్వేశ్వర శర్మ

సమ సమాజం గురించి - డా॥ సర్దేశాయి తిరుమలరావు


విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **"చేతిలో క్షీర పాత్రతో చల్లలమ్మ"**

ఈ చిత్రంలోని కాంతి మిణుగురులు ఫోకస్ చేయని దర్పణంలోంచి చూసినట్లు కనిపిస్తున్నాయి. దీనిని బట్టి అర్థమయ్యేది ఏమంటే వెర్మీర్ స్వయంగానే ప్రకృతిలో దానిని దర్శించాడని.

చిత్రకారుడు : **వెర్మీర్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# How to stop being absent - minded

**- Biswaroop Chowdary**

BEING absent-minded is one of the major problems a student faces, specially during the exams when he is overburdened with a huge syllabus. In this issue we will share some tips which can help a student in becoming alert, aware of his work and being less absent - minded.

It is a known fact that out of our five senses, our sense of hearing is the strongest. Experiments have proved that hearing a 10 digit number for two minutes will register in the long term memory than by merely looking at it for the same period of time. We all have had the experience of trying to remember a phone number we have looked up and not having a pencil or a pen to write it down. We repeat it aloud over and over again until we have something to write the number. Hearing our own voice repeat the number assists us in holding on to it.

**How to use the power of hearing**

If you merely observe putting your pen on the shelf, you are using your visual cue. However if you say it aloud to yourself "I am now putting this pen on the shelf you are adding a powerful sense to your memory, Besides just seeing the pen and shelf you are also hearing the connection. By doing this you are forcing yourself to give undivided attention to the activity.

Similarly you can make a habit of describing to yourself the things which you otherwise tend to forget by saying aloud to yourself. "I must write the letter today at 4:00pm." or "I must remember that I have to carry my tuition notes to school".

By talking to yourself you are preventing being absent - minded which keeps you from remembering. Instead of being absent-minded when you put on your watch, you also attend to the task. You actually strengthen your memory in four ways :

1. By talking to yourself you hear where the object, 2. You think more of the object. 3. You concentrate more. 4. You see exactly what you do.

Be sure to describe to yourself what you are doing "I am putting the book in the steel almirah. I see it clearly". The more often you practice a variety of memory skills, the less often you will be absent-minded.

Don't ignore this 'talking to yourself techniques' just because it seems silly.

Reviewing your shopping list out aloud in a crowded bus or train may cause raised eyebrows and certainly is not appropriate. But in the privacy of your own home, such low voiced reminders works wonders.

An experiment with yourself :

Here are two lists of random words. Read the first list silently and then close the paper and try to recall the list.

For the second list read the words aloud, then close the paper and try to recall the list.

Notice the difference.

| List 1. | List 2. |
|---|---|
| Ball, | Car, |
| Shoe, | Telephone, |
| College, | Pencil, |
| Maths, | Computer, |
| Cupboard, | Physics, |
| School, | Bike, |
| Shirt, | Star, |
| Fish, | Queen, |
| River, | Chocolate, |
| Book, | VCR, |
| Lamp, | Pencil, |
| Chair | Bucket. |

The writer is a psychologist and director of Human Learning Systems India, (www.hisindia.org). If you have any queries please write to him at **voices@thestatesman.net.**

*- Courtesy by* **The Statesman**

# ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - I

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

మనో విజ్ఞాన శాస్త్రం అనే పేరు కంటె చాలమందికి సైకాలజీ అంటేనే బాగా తెలుసు. సైకాలజీ మీద జనసామాన్యానికి ఒక రకమైన అపప్రథ ఉంది. అదేమిటంటే సైకాలజీ తెలసిన వానికి ఇతరుల మనస్సులో ఏమి జరిగేది తెలుసుకొనే శక్తి ఉంటుంది అనే భ్రమ ఉంది. సైకాలజీ చదివినంత మాత్రాన ఇతరుల మనస్సుల్లో ఏముందో తెలుసుకొనే శక్తి రాదు. సైకాలజిస్టు ఇతరులను ప్రశ్నించి, తాను శిక్షణ పొందిన కొన్ని పద్ధతుల వల్ల, వారి వారి మూర్తిమత్వాలను అంటే Personalitiesని కొంతవరకు లేదా చాల వరకు ఇతరుల కంటె బాగా అంచనా వేయగలడు. తద్వారా ఆయా వ్యక్తుల భావి ప్రవర్తనలను కొంతమేరకు ఊహించగలడు. ఈ కారణంగానే ఈనాడు సైకాలజీని వివిధరంగాలలో - మిలటరీలో, విద్యలో, ఉద్యోగాలివ్వడంలో, వైద్యంలో, పిల్లల పెంపకంలో, ఒకటేమిటి దాదాపు మానవుని అన్ని జీవనరంగాలలో ఉపయోగిస్తున్నారు. ఇలా ఉపయోగించడానికి కారణం ఏమిటి?

మనిషి ఏ రంగంలో ఏ పని చేసినా, ఆలోచించి చేయాలి. ఆలోచన మనస్సుతో జరుగుతుంది. మరి మనస్సును గురించి అధ్యయనం చేసేది మనస్తత్వ శాస్త్రం. అందుకే అది అన్ని రంగాలలోను కనిపిస్తుంది.

మనో విజ్ఞాన శాస్త్రం ఒక శాస్త్రంగా ఇటీవలే ఆవిర్భవించినా, అంటే ఇంకా నిండు నూరేళ్ళు నిండక పోయినా - అంటే ఆధునిక మనో విజ్ఞాన శాస్త్రం ఇతర శాస్త్రాల నుంచి విడివడి వేరే ప్రత్యేక శాస్త్రంగా 1912 లోనే ఆవిర్భవించినా - దీని మూలాలు చాల ప్రాచీనాలు. మనో విజ్ఞాన శాస్త్రం అనే పేరుతో అది ప్రత్యేకంగా రూపుదిద్దుకోక పోయినా, మనిషిని గురించి ఆలోచించిన ప్రతివాడు మనస్సును గురించి ఆలోచించి తీరవలసిందే. అంటే ఒక విధంగా చెప్పాలంటే మనిషిలో ఆలోచన రూపుదిద్దు కోవడం ప్రారంభమైన నాటి నుంచే మనోవిజ్ఞాన శాస్త్రం ఉంది. రక్త ప్రసరణం మానవునిలో ఎప్పుడూ జరుగుతుందని హార్వే పదహారో శతాబ్దంలో చెప్పకముందు నుంచే, మానవుడు పుట్టిన నాటి నుంచే, జరుగుతోంది. సైకాలజీ గూడ అంతే.

ఈ విశ్వంలో అన్ని జీవరాసులలోకి మానవుడు విలక్షణమైనవాడు. తనకు తానే సమస్య అయిన వాడు. Man is the only living creature who is painfully and critically aware of his existence. అంటే అతడికి తన ఉనికే తనకు సమస్య అయింది. అంటే మానవుడు ఆత్మ చైతన్యం పొందిన నాటి నుంచి self conscious అయిన నాటి నుంచి ఈ సమస్యను అతడు బృహత్తరంగా ఎదుర్కొన్నాడు. జంతువులకు చైతన్యం ఉంది, మనిషికీ చైతన్యం అతడు ఆలోచించగలడు, ఆలోచించేటప్పుడే ఆలోచిస్తున్నాననే ఎరుక awareness అతనికి ఉంటుంది. ఇది జంతువుకు లేదు. ఈ దశ నుంచే మానవుడు తనను గురించి ప్రకృతి గురించి, పరిసరం గురించి విచక్షణా జ్ఞానంతో విశ్లేషించుకోగలిగాడు. అప్పటి నుంచే జ్ఞానం సంచయం కావడం మొదలైంది.

ప్రపంచాన్ని గురించి ప్రకృతి గురించి తెలుసుకోవాలంటే, మనిషి తాను దానిని ఎలా చూడగలగుతున్నాడు, తాను ఎలా ఆలోచించగలుగుతున్నాడు అనే విషయాలను అర్థం చేసుకోవాలి.

ఈ ప్రయత్నమే మనోవిజ్ఞాన శాస్త్రం, ఆవిర్భావానికి దారి తీసింది. పాశ్చాత్య మనో విజ్ఞాన శాస్త్రానికి పునాది క్రీ.పూ. ఐదవ శతాబ్దిలోనే పడింది. సోఫిస్టులలో - అంటే జ్ఞానులలో - ఒకరైన ప్రొటాగొరస్ చెప్పిన వాక్యంతో ప్రారంభమైందనవచ్చు. ఆయన చెప్పిన వాక్యం 'Man is the measure of all things' అంటే మానవుడు అన్ని విషయాలకు కొలబద్ద - ''అంటే మనిషికి ఏది సత్యమని తోస్తే అదే సత్యం'' అని అర్థం. దీనికి అర్థం ఏమంటే, మనిషికి తెలిసిందంతా గూడ దానిని అతడు ఎలా తెలుసుకొన్నాడనే దాని మీద ఆధారపడి ఉంటుంది అని.

అరిస్టాటిల్ మొదలుకొని జొరాస్టర్ వరకు ఉన్న మేధావులు, చింతనా పరులంతా అనేక ప్రశ్నలు వేసుకొని వాటికి సమాధానం చెప్పారు. వాళ్ళు వేసిన ప్రశ్నల్లో చాలా భాగం ఈనాడు మనం మనో వైజ్ఞానికాలని పిలిచేవే. ఆధునిక మనో విజ్ఞాన శాస్త్రజ్ఞులకు వలె వారూ మనుష్యులు సమాచారాన్ని జ్ఞానేంద్రియాల ద్వారా ఎలా గ్రహిస్తారు, సమస్యల పరిష్కారానికి దానిని ఎలా విని వినియోగిస్తారు, ఎలా ప్రేరితులై ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రవర్తిస్తారు, ఎలా వారి చిత్తవృత్తులు, ఉద్వేగాలు మారుతాయి? అనే విషయాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. అయితే ఆ తాత్త్వికులలో చాల మంది ఆనుభవిక విషయాలను సాక్ష్యంగా తీసుకోక, కథలను, చరిత్రలను, వర్ణనలను ఆధారం చేసుకొన్నారు. అలాగని వారంతా అదే పద్ధతిని అవలంబించారని కాదు. ఆధునిక వైద్యశాస్త్రానికి పితామహుడుగా పరిగణింపబడుతున్న ప్రాచీన గ్రీకు వైద్యుడు హిపొక్రిటీజ్ తన రోగులను పరిశీలించిన మీదటనే, ''మన సుఖ, సంతోష, బాధ, హేసాలకు మూలం మెదడే'' అని తేల్చి చెప్పాడు. ఇప్పటికీ అది అంతే.

పదిహేడో శతాబ్ది ఫ్రెంచి గణిత వేత్త, దార్శనికుడు అయిన డేక్కార్ట్ చెప్పిన ఎన్నో సిద్ధాంతాలను తోసిరాజన్నా, ఆయన చెప్పిన ఒక సిద్ధాంతం ఆకుంచన (reflex) భావనను వివరించడానికి పనికి వచ్చింది. ఏదైన ఒక జ్ఞానేంద్రియాన్ని ఉద్దీపింప జేసినప్పుడు, అది ఒక సిగ్నల్‌ను మెదడుకు పంపుతుందని, అది తిరిగి దానిని కండరాలకు పంపుతుందని చెప్పి, ఈనాటి మనో విజ్ఞాన శాస్త్రంలోని ఉద్దీపన - ప్రతిస్పందన సిద్ధాంతానికి దారి తీశాడు.

ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం, మొన్న ఆమధ్యనే, 1879లో లైప్‌జిగ్ జర్మనీలు విల్‌హెల్మ్ వూంట్ మనో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల స్థాపించడంతో, ఆరంభమైందని చెబుతారు. అయినా దానిని అందరూ అంగీకరించరు. ప్రపంచం అంతట మనో విజ్ఞానం శాస్త్రం తన మాతృ గర్భ అయిన తత్వశాస్త్రం నుంచి విడివడి, ప్రత్యేక శాస్త్రంగా రూపుదిద్దుకొంది. 1900 ప్రాంతాల కావడంతో, 1912 ప్రాంతంలో అనేక మంది తమతమ సిద్ధాంతాలను ప్రతిపాదించడంతో, 1912ని ఆధునిక మనో విజ్ఞాన శాస్త్ర ఆరంభంగా చెబుతారు. వూంట్ ప్రయోగశాలలో, నియంత్రిత పరిస్థితులలో, ప్రయోజ్యులు తమ మానసికానుభవాలను విశ్లేషించి వర్ణించేవారు. ఈ విధానాన్ని అంతః పరీక్షణం (introspection) అనేవారు.

తరువాత ఇద్దరు గొప్ప మనో విజ్ఞాన శాస్త్ర వేత్తలు వచ్చారు. వారిలో ఒకరు ఇ.బి. టిబెనర్. ఈయన సిద్ధాంతాన్ని నిర్మాణ వాదం - structuralism అంటారు. ఇందులో, ఇంద్రియ జ్ఞానాన్ని, ప్రతిమలను (images) అనుభూతులను విశ్లేషించడం ఉంటుంది. తరువాతి వారు విలియమ్ జేమ్స్ ఈయన వాదం ప్రకార్యకవాదం (functionalism). ఈ సిద్ధాంతం, 'ఒక జీవి తన

ప్రవర్తనతో పరిసరానికి ఎలా సర్దుబాటు చేసుకొంటుంది,' అనే విషయాన్ని పరిశీలిస్తుంది.

అయితే నేటి ఆధునిక మనో విజ్ఞాన శాస్త్రం ఎంతగానో మారిపోయింది. మానవ ప్రవర్తన అత్యంత సంక్లిష్టం గనుక, మనో విజ్ఞాన శాస్త్రాన్ని నిర్వచించడం గూడ కష్టమే. ఈ శతాబ్ది మొదట్లో సైకాలజీని మానసిక జీవితాన్ని, మనస్సును లేదా చైతన్యాన్ని అధ్యయనం చేసే శాస్త్రంగా చెప్పారు. కొద్ది కాలంలోనే ఈ నిర్వచనాన్ని తూర్పార పట్టారు. ఆ తరవాత వచ్చిన వారు, మనస్సు కంటికి కనపడేది కాదు కనుక, మనోవిజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయ ప్రాతిపదిక మీద నిలపాలంటే, పరిశీల్యమానమైన విషయాలనే అది అధ్యయనం చేయాలన్నారు. ప్రవర్తన పైకి కనిపించేది కనుక, ఆ శాస్త్రం ప్రవర్తననే అధ్యయనం చేయాలని, మనస్సును కాదనీ, అన్నారు అలాగా, దానిని ప్రవర్తన శాస్త్రంగా నిర్వచించారు. వీరిలో ముఖ్యుడు జె.బి. వాట్సన్.

కాని ఈనాటి మనో విజ్ఞాన శాస్త్రజ్ఞులు మనస్సుకు, ప్రవర్తనకు రెండింటికి చోటు కల్పించాలని భావిస్తున్నారు. అందుకని ఇవ్వాళ సైకాలజీకి ఇచ్చే నిర్వచనం ఇది: సైకాలజీ అనేది ప్రవర్తనను, మానసిక ప్రక్రియలనే గాక, జీవిని భౌతిక స్థితులు, మానసిక స్థితులు, పరిసరం ఎలా ప్రభావితం చేస్తున్నాయి అనే విషయాలను అధ్యాయనం చేస్తుంది. మొత్తం మీద సైకాలజీ చేసే పనులు లేదా దాని లక్ష్యాలు ఏవంటే, మనస్సు, ప్రవర్తనలను (1) వివరించడం (2) అర్థం చేసుకోవడం (3) వాటిని ఊహించడం - అంటే అవి భవిష్యత్తులో ఎలా ఉంటాయోయని ఊహించడం (4) వాటిని నియంత్రించడం. ఈ నియంత్రించడం ఎందుకు అవసరమవుతుందంటే, మనకు ఉపయోగపడని ప్రవర్తనా రీతులేవైనా ఉంటే, వాటిని అదుపులో ఉంచి, అనుకూలంగా మార్చుకోవచ్చు. మానసికారోగ్యాన్ని సరిద్దుకోవచ్చు.

ఇరవయ్యో శతాబ్ది ప్రథమార్ధంలో మనో విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన అనేక ధోరణులు లేదా దృక్కోణాలు ఒక దానితో ఒకటి ప్రథమ స్థానం కోసం పోటీ పడ్డాయి. పోయినవి పోగా ప్రముఖంగా నిలచినవి ఐదు దృక్కోణాలున్నాయి. అవి (1) ప్రవర్తన వాదం (2) మనోవిశ్లేషణ (3) మానవవాదం (4) సంజ్ఞానాత్మకం అంటే cognitive (5) శరీర ధర్మ లేదా physiological వాదం. ఈ వాదాలను అర్థం చేసుకోవడం చాల కష్టం. అందుకని నేను ఒక మానవ ప్రవర్తనాంశాన్ని తీసుకొని, ఆ అంశాన్ని అవి ఎలా దర్శిస్తాయో వివరిస్తాను.

ఇప్పుడు మనం హింసా ప్రవర్తనను తీసుకొందాం. ఈ హింసా ప్రవర్తనను ప్రవర్తన వాదం ఎలా చూస్తుంది అనే దానికి ముందు ప్రవర్తనా వాదం అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఈ వాదానికి ఆద్యుడైన జె.బి. వాట్సన్ ఇలా అంటాడు. సైకాలజీ: మనస్సును, మానసిక స్థితులను, ఉద్వేగాలను అధ్యయనం చేయ కూడదు. ఎందుకంటే అవి బాహ్య వస్తువులు లాగ మనకు కనపడవు. అంతః పరిశీలనం introspection అనే పద్ధతిని గూడ విడనాడాలి. పైకి కనిపించే ప్రవర్తనే అధ్యయన విషయం కావాలి. ఒకనిని చాకుతో పొడిచినప్పుడు, అతడు ఏ అనుభూతి చెందాడో మనకు అవసరం లేదు. అతడు కార్చిన కన్నీళ్లు, దూరంగా పారిపోవడం, ఇవి మాత్రమే కనిపిస్తాయి. వీటిని మాత్రమే సైకాలజీ అధ్యయనం చేయాలి.

హింసను అధ్యయనం చేసేటప్పుడు ప్రవర్తనవాదులు వ్యక్తి లోపల ఏమి జరిగేది పరిశీలించరు. హింసా కార్యం ముందు వెనుక పరిసరంలో ఏమి జరిగింది ఏ సన్నివేశాలు హింసను ప్రోత్స

హిస్తాయి, హింసను ఎలా పారితోషిక, దండనల ద్వారా, అంటే అభ్యసనం learning ద్వారా, ఎలా పరిహరించ వచ్చో, వీటిని అధ్యయనం చేయాలంటాడు ప్రవర్తనవాది.

ఇక రెండో దృక్కోణం సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనో విశ్లేషణ సిద్ధాంతం. మనిషిలోని ప్రేరణలు, ప్రబోధనలు, ముఖ్యంగా, లైంగిక సంబంధమైనవి, దౌర్జన్య సంబంధమైనవి. వీటిని బాహాటంగా వ్యక్తం చేస్తే సమాజం సహించదు గనుక, వ్యక్తి వాటిని మనస్సు నుంచి వెలుపలకి అంటే అచేతనంలోకి గెంటి వేస్తాడు. అయితే అవి అక్కడ అలా ఊరికే పడి నిద్రపోవు. వీలైన అన్ని మార్గాల ద్వారా అని బయటికి రావాలని ప్రయత్నిస్తాయి. అవి కలల ద్వారా, నిత్య జీవితంలో నోరు జారడం లాంటి తప్పుల ద్వారా, జోకుల ద్వారా, వ్యక్తికి తెలియకుండానే బహిర్గత మవుతాయి. అందుకని, మనం అర్థం లేదని కొట్టి పారవేసే ప్రతి ప్రవర్తనా శకలానికి అర్థం ఉంటుంది.

హింస, దౌర్జన్యాలు, ఫ్రాయిడ్ దృష్టిలో, సహజాతాలు. ఇవి అచేతనంలో ఉంటాయి. అచేతనంలో ఉన్న వీటికి, వెలువడే మార్గాలు కల్పించి, వాటి శక్తిని సమాజానికి ఉపయోగపడేట్టు చేయాలంటాడు ఫ్రాయిడ్.

మూడోది మానవ వాద సైకాలజీ. దీని ఆద్యుడు అబ్రహామ్ మాస్లో. ఇది మానవ ఆశంసలకు, ఆకాంక్షలకు, స్వేచ్ఛా సంకల్పానికి (Free will) సంబంధించింది. బలమైన, ఆరోగ్యకరమైన, సృజనాత్మకమైన, రుషిపుంగవులైన వారిని ఎన్నుకొని అధ్యయనం చేస్తే, వారెంత ఎత్తుకు ఎదగగలరో చూడవచ్చు అన్నాడు మాస్లో. మన ప్రవర్తన పూర్తిగా పరిసరంతోనో, గతానుభవాలతోనో నియంత్రితం కాలేదు. మనిషికి 'ఏంపిక స్వేచ్ఛ' ఉంది అంటాడాయన. హింసను సహజాతం అంటే వీరు ఒప్పుకోరు. ఇతరులకు తోడ్పడాలనే సహజ ప్రవృత్తికి అవరోధం కలిగినప్పుడు హింసరేగుతుందంటుంది ఈవాదం.

నాలుగోది సంజ్ఞానాత్మక మనో విజ్ఞానం. తెలుసుకోవడంలో ఇమిడి ఉన్న మానసిక ప్రక్రియల మీద ఇది దృష్టిసారిస్తుంది. మానసిక ప్రతిమల మీద ఆధారపడి మనం అవధానాన్ని నిర్దేశిస్తాము, ఆలోచిస్తాము, సమస్యలను పరిష్కరిస్తాము అనే విషయాలను అధ్యయనం చేస్తుంది. మరి హింసను గురించి ఇది ఏమంటుంది? మనం వాస్తవాన్ని ఎలా దర్శిస్తాము. ఇతరుల ఉద్దేశాలు ఏమిటి అనేదాని మీది ఆధారపడి మనం చర్యలు జరుపుతాం. హింసకు త్వరగా పాల్పడేవారు తమను ఇతరులు అవమానిస్తున్నారని భావిస్తారు.

ఐదోది శరీర ధర్మ మనో విజ్ఞాన శాస్త్రం. మనస్సును అర్థం చేసుకోవాలంటే, నాడీ మండలాన్ని అధ్యయనం చేయాలి. సైకాలజీ జీవశాస్త్రం మీద, శరీర నిర్మాణ శాస్త్రం మీద ఆధారపడాలి. మెదడులో కొన్ని ప్రాంతాలను ఉద్దీపింప జేస్తే హింసా ప్రవర్తన నిష్పన్నమవుతుందని ప్రయోగాలు రుజువు పలుకుతున్నాయి.

సైకాలజీలో ఇంకా ఎన్నో, ధోరణులున్నాయి. నేను మీ ముందు కొన్ని ముఖ్యమైన వాటినే ఉంచాను. ఇలా సైకాలజీ శాఖోపశాఖలై ఈ శతాబ్దంలో మానవ జీవితపు అన్ని రంగాలలో ప్రవేశించి, మానవ ప్రవర్తనను బాగా అర్థం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడుతోంది.

( ఈ వ్యాసం ఆకాశవాణి, విజయవాడ కేంద్రంద్వారా ప్రసారితమైంది)

# ఇస్మాయిల్ సంస్మరణ

– శివలింగం

ఇస్మాయిల్‌గారు నవంబరు 25వ తేదీన మరణించి కవితాలోకంలో తీరనిలోటు కలిగించారు. చెట్టు కవిగా లబ్ధ ప్రతిష్టులు. తనదైన, అరుదైన మృదువైన బాణి ఆయన కవితావాణి. ప్రాక్పశ్చిమ కవిత్వాలు, దర్శనాలు విమర్శలు బాగా ఎరిగినవారు. నిరంతర అధ్యయనం, అభ్యాసం ఆయన సొత్తు. బాలబంధు బి.వి. నరసింహారావుగారు మాయింటికి వచ్చినపుడు ఇస్మాయిల్ గురించి చెప్పారు. పరిచయం చేసుకుని వారి కవిత్వాన్ని చదివి ఒక వ్యాసం రాశాను. ఉత్తరాలు రాసేవారు. శబ్దాడంబరాన్ని ఒప్పుకోరు. మానవుని జ్ఞాననేత్రానికి లోక వృత్తాంతం కనిపించేలా కవితా జ్యోతిని వెలిగించారు. యశోధనార్జనాసక్తి లేదు. ఉద్యమాలంటే గిట్టవు. ఉపాధ్యాయుడైనా ఉపన్యాసాలకు దూరం. కవిత్వం అల్లరి చేయదు, గొంతుచించుకోదు, గోలపెట్టదు. నిండైన గోదారిలా ప్రశాంతంగా ప్రవహిస్తుంది. క్లుప్తత, స్పష్టమైన పదచిత్రాలు, చక్కని చిక్కని పదాల పోహళింపు. కోనసీమ ప్రకృతి నిసర్గసౌందర్యం, జడ వస్తువులు కూడా చైతన్యంతో తొణికి సలాడే ఇంద్రజాలం ఆయన సొత్తు. తాత్వికుడు కావడం నుంచి ఆవేశకావేశాలకు లోనుకాడు. నిగ్రహంతో, నెమ్మదిగా విమర్శకులకు సమాధానం యిచ్చేవాడు. తెలుగు కవులను ఎంతో నచ్చితే తప్ప మంచి కవిత్వమని కితాబు యిచ్చేవాడు కాదు. తత్వశాస్త్ర చర్చలు పూర్తి అయిపోయినాయి. కొత్తగా చెప్పవలసిందేమీ లేదు. ఇంతకు ముందు చెప్పినదాని మీద వ్యాఖ్యానాలు విమర్శలు ఇప్పుడు. B.K. Matilal భారతీయుడు. Journal of Indian Philosophyకి సంపాదకుడు, ఇప్పుడు లేడు. ఆయన పాశ్చాత్యులకు భారతీయతత్వ శాస్త్రం గురించి తెలుపుతూ వ్యాసాలు రాస్తున్నాడని రాశారు. ఇస్మాయిల్ నాకురాసిన ఉత్తరాలను ఆహ్వానంకు పంపితే వారు ప్రచురించారు. ఉత్తరాలు ప్రచురణకి స్థారనుకోలేదు. కవుల గురించి విస్పష్టంగా రాసినవి మిత్రులైన వారు చదివి బాధపడతారని' నాకు రాశారు. మాట్లాడి మౌనం అంటారు వేదాంతులు. ఇస్మాయిల్ కూడా తాత్వికుడు గనుక కవిత్వంలో నిశ్శబ్దం వుండాలంటాడు. ఓటి డబ్బాలో గులకరాళ్లు వేసి మోగిస్తే గలగల లాడుతూ శబ్దిస్తాయి. ఈతరహా కవిత్వం అంటే గిట్టదు. 'దళిత కవిత్వం గురించి డప్పులు మోగిస్తున్నారేవిటి అఫ్సర్ వీళ్లూ 'దళిత కవిత్వం ఏముందని? వీళ్ళల్లో సతీష్ చందర్ ఒక్కడే కవి. అతణ్ణి మిగతా వాళ్ళంతా కట్టు కట్టి తిడుతున్నారు. ఇక దళిత కవిత్వమే ముంది. తెలుగు సినిమాలు పత్రికలు చూట్టం మానేశాను. హాయిగా వున్నాను, చైనీస్, జాపనీస్ సాహిత్యం ఎక్కువగా చదువుతున్నానీ మధ్య. తెలుగులో మంచి పుస్తకాలు లేవు మీరు చదవదలచుకున్నా' అని ఒక ఉత్తరంలో రాశారు. W.B. Yeats పద్యాల

---

శివలింగం, చల్లపల్లి

పుస్తకం నాకు దొరికింది కాని డిలాన్ థామస్ దొరకలేదు. ఆంగ్లంలో వ్యాసాలు చదవడమే. తరవాత మిత్రుడు కవి కుమార్. కుష్వంత్ సింగ్ రాసిన వ్యాసం కాపీ పంపాడు.

Under Milk Wood Collected Poems (1934-52) పుస్తకం చదివినపుడు కుష్వంత్ సింగ్‌కూ అర్థ కాలేదట. Paul Ferris రాసిన డైలాన్ థామస్ గ్రంథం చదివిన తరవాత అర్థం అయిందన్నాడు. థామస్ భాష incantatory and wild land mythical drunken speech అని ఆడెన్. థామస్‌ను గురించి ఇస్మాయిల్‌ను అడిగాను. సమాధానమిస్తూ W B Yeats, Dylan Thomas ఈ శతాబ్దపు గొప్ప కవులు. T S Eliot కన్నా గొప్పవాళ్ళు అన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో డిప్యూటీ కమీషనరు. మిత్రులు సాహిత్యాభిమాని అయిన హర్షవర్ధన్ గారింటికి ఏలూరు వెళ్ళాను.

పుస్తకాలు చూస్తుంటే చెట్టంత కవికి పిట్టంత సత్కారం ఇస్మాయిల్ అభినందన, సంకలనం స్మైల్, పుస్తకం కనబడింది. అందులో నా వ్యాసం వుంది. 15-6-2002 హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇస్మాయిల్ అభినందన సభ జరిగింది. ఒక కాపీ అయినా పంపలేదనుకున్నాను.

ఇస్మాయిల్ ఋషి- ద్రష్ట. ద్రష్ట అంటే ఆధ్యాత్మికంగా అర్థం చెపితే ఆత్మను దర్శించువాడు. కవి పరంగా చెపితే వస్తువు విచిత్ర ధర్మ తత్వాలను దర్శించువాడు. చూపు రూపులు కలిసినపుడే అద్వైతాను భూతి. విత్తనం చిన్నదే. దానిలో ఎంత వృక్షందాగుందీ. కవిత్వం చిన్నది గానే కనిపించినా భావం ఎంతో వుంటుంది. కవిత్వం కాంతా సమ్మితం అనీ ఆకులందున అణగిమణిగీ కవితకోకిల పలకాలని అంటారు. ఇస్మాయిల్ కవిత్వంలో అనుభూతి ద్వారా సిద్ధించే ఆనందం వుంది. తర్కానికి తావులేదు. As the reason destroys, the poet must create. అభ్యుదయ కవిత్వానంతరధోరణలు 1987 పుస్తకం చదివి మీ అభిప్రాయమేమిటని అడిగితే సుదర్శనంగారి సాహిత్యము, ఆధునికత వ్యాసం ఒక్కటే బాగుంది అన్నారు. విషయం కూడా మన తెలుగు విమర్శకులు అర్థం చేసుకోలేని స్థితిలో రాస్తున్నారు అని వారి ఆవేదన. చెట్టు ప్రాచీన సాహిత్యంలోనూ కనిపిస్తుంది. ఉపనిషత్తులో శరీర వృక్షం మీద జీవుడు, పరమాత్మ అనే రెండు పక్షులు పరస్పరాలింగనం చేసుకొని వున్నాయి. జీవుడు సుఖదుఃఖ రూపఫలాన్ని అనుభవిస్తుంటే పరమాత్మ సాక్షిగా వున్నాడు. సంసారం ఒక వృక్షంగా శంకరుడు వివేక చూడామణిలోను, 'ఊర్ధ్వమూలమధశ్శాఖమశ్వత్థం' - గీతలో వృక్షం వ్యత్యస్తమయింది. ఇస్మాయిల్ చెట్టు నీడలో ఎన్నో అనుభూతులు, ఆనందాలు. ఆయన కవిత్వం నిత్య జీవితానంద యాత్రోత్సవం. ఇస్మాయిల్ మరపురాని మహానుభావుడు. కవి హృదయం గలమానవతా వాది.

# పాల్ జొహాన్ లుడ్విగ్ హేస

## (1910వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారగ్రహీత)

## పురస్కార ప్రదానం

మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్ అనువాదం : బి.వి. రామిరెడ్డి

శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి

చాలాదేశాల సుప్రసిద్ధ రచయితల పేర్లు ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారానికి ప్రతిపాదింప బడ్డాయి. స్వీడిష్ అకాడెమి దాదాపు అరవైమంది కళ, సాహిత్యం, తత్త్వశాస్త్రాల్లో నిష్ణాతులైన జర్మన్ పండితులు ఏకగ్రీవంగా అంగీకరించిన జర్మన్ రచయిత పాల్ హేసకు ఆపురస్కారాన్నివ్వాలని నిర్ణయించింది. ఆ ప్రసిద్ధ రచయితకు ఆయన సాహితీ ఔన్నత్యానికి గుర్తింపుగా ఈ పురస్కార ప్రదానం జరుగుతోంది.

పాల్ హేస 1830లో బెర్లిన్‌లో జన్మించాడు. ఆయన తండ్రి కార్ల్ విల్‌హెల్మ్ హేస భాషా శాస్త్రవేత్త. తల్లి జూలీ సాలింగ్ యూదు. హేస తండ్రి నుండి ఆత్మీయత, ఉత్సాహాల్ని పుణికి పుచ్చుకున్నాడు. అతని స్కూలు సంవత్సరాలు త్వరగా గడిచి పోయాయి. అతడు ఏకసంథాగ్రాహి. బెర్లిన్‌లో కొంత కాలం రోమాన్స్ భాషా శాస్త్రం చదివాడు. తరువాత బాన్ విశ్వవిద్యాలయంలో ఫ్రెడ్రిక్ డీజ్ వద్ద రోమాన్స్ భాషా శాస్త్రం అభ్యసించాడు. 1852లో డాక్టరేట్ పుచ్చుకున్నాడు. తరువాత తనకు లభించిన ఉపకారవేతనంతో ఇటలీలో పర్యటించి అచటి కళా సాహిత్యాలను అధ్యయనం చేశాడు. కళా చరిత్ర కారుడి కుమార్తె మార్గరెట్ కుగ్లర్‌తో వివాహం నిశ్చయమయింది. కవి ఇమ్మాన్యుయెల్ జీబెల్ సలహా మేరకు మాక్స్ మిలియన్ -II మ్యూనిచ్‌లో అతణ్ణి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించాడు. 1854 మే 15న మార్గరెట్‌ను వివాహమాడి మ్యూనిచ్‌లో స్థిరపడ్డాడు. అక్కడి సాంస్కృతిక జీవితానికి ముఖ్యుడయ్యాడు. భార్య మార్గరెట్ చనిపోయిన అయిదేళ్ల తరువాత అన్నాష్కుబార్ట్‌ని వివాహం చేసుకున్నాడు.

1855 - 1862 సంత్సరాల మధ్య కాలంలో హేస తన మొదటి నాలుగు నవలికలను రచించాడు. ఆయన 1853లో రచించిన ''ఎల్ అర్రాబ్బియాటా'', 1859లో రచించిన ''ఆంద్రె డెల్ఫిన్'', 1875లో రచించిన ''నెరినా'' నవలికలు ముఖ్యమైనవి. ఆయన 1859లో రచించిన ''పోర్ట్రేట్ ఆఫ్ ఎ మదర్'', 1855లో రచించిన ''మారియన్'' ప్రసిద్ధ రచనలు. హేస తన నవలికల్లో ఖచ్చితమైన విధానాన్ని పాటించాడు. ''సాహితీ విలువలున్న నవలిక ముఖ్యమైన మానవ గమ్యాన్ని పాటించాలి. అది నిత్య జీవిత విషయాలను కాక క్రొత్త మానవ స్వభావ పార్శ్వాన్ని ఆవిష్కరించాలి, ఖచ్చితమైన ఏకాగ్రతను పాటించాలి.''

హేస ఆధునిక మనస్తత్త్వ విశ్లేషణ నవలకు ఆద్యుడు. ఆయన 1872లో రచించిన ''ది చిల్డ్రన్ ఆఫ్ ది వరల్డ్'', 1875లో రచించిన ''ఇన్ పేరడైజ్'' నీతి సమస్యలను చర్చించిన నవలలు. మొదటి నవలలో మూఢ నీతుల నుండి స్వేచ్ఛను, రెండో నవలలో ప్యూరిటానిజంకు వ్యతిరేకంగా కళను సమర్థించాడు. వీటిలో రచయిత మానవతా వాదం కనిపిస్తుంది. ''ఇన్ పేరడైజ్''లో మ్యూనిచ్‌కు చెందిన కళాకారుల వర్ణన కనిపిస్తుంది. 1904లో రచించిన ''అగైనిస్ట్ ది స్ట్రీం'' లో హేస ధైర్యంగా ద్వంద్వయుద్ధ విధానాన్ని, దానికి దారితీసే ప్రెజుడిసెస్‌ని సవాల్ చేశాడు. 1909లో రచించిన ''బర్త్ ఆఫ్ వీనస్'' లో కళా స్వేచ్ఛను సమర్థించాడు.

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

హేస్ నవలికా రచయితే కాదు గొప్ప గేయ రచయితకూడా. అతడెన్నో గేయ నవలికలు కూడా రచించాడు. 1879లో రచించిన ''సలమాండర్'' ఇందుకు గొప్ప ఉదాహరణ. నాటకం అతని సహజ ప్రతిభా వాహిక కాకపోయినా, మంచి నాటకాలు కూడా రచించాడు. 1865లో రచించిన ''కోల్‌బెర్గ'', ''హాడ్రియన్'' నాటకాలు పఠితల్ని ఆకట్టుకుంటాయి.

హేస్ స్వతంత్ర రచయిత. అతడు తన మిత్రుడు ఇబ్సెన్ వ్రాసిన ''దిప్రిటెండర్స్'', ''వైకింగ్స్ ఎట్ హెల్గెలాండ్'' ల్ని అతడు అభిమానించినా అతనికి దయ్యాలమీద నమ్మకంలేదు. అతనికి వాగ్నర్ కంటె బీతోవెన్, మొజార్ట్, స్కుబర్ట్, చోపిన్, బ్రామ్స్ లంటేఎక్కువ అభిమానం.

జీవితంలో అన్ని సమస్యాత్మక సమయాల్లోను హేస్ స్వేచ్ఛను వొదల్లేదు. తన మిత్రుడు జీబెల్ కింగ్ విలియంకు రెండు జర్మనీలను ప్రష్యా ఆధ్వర్యంలో ఏకీకరించడం గురించి వ్రాసిన కవితవల్ల బవేరియన్ ఆస్థానంలో తన ఉద్యోగాన్ని పోగొట్టుకున్నప్పుడు అతనికి మద్దత్తుగా, అతని అభిప్రాయాలను సమర్థిస్తూ తన పదవిని వొదులు కోవడానికి సిద్ధపడుతూ రాజుకు ఉత్తరం వ్రాశాడు.

హేస్ జర్మనీలో లాగనే ఇటలీలోను సుప్రసిద్ధుడు. అతని ఇటాలియన్ సాహిత్యానువాదాలు జర్మనీలో ప్రసిద్ధమయ్యాయి. అతని అనువాదాలవల్లనే ఇటాలియన్ రచయితలు లియోపార్డి, మంజోని, ఫొసెలో, మోంటి, పారిని, జియాస్టిలు జర్మనీలో ప్రసిద్ధులయ్యారు. హేస్ ఎప్పుడూ సంపద కోసంప్రాకులాడ లేదు. తండ్రిగా తన పిల్లల మరణం వల్ల ఎంతో ప్రభావితుడయ్యాడు. అతడు తన దుఃఖాన్ని ఎన్నో గేయాల్లో వ్యక్తీకరించాడు.

సాహిత్యపరంగా ఎనభైలలో ప్రకృతివాదం బలంగా ఆవిర్భవించినా, అది హేస్ సాహిత్యాన్ని ఎదుర్కొన్నా, అతడు తలవొంచలేదు. సాహిత్యం జీవితాన్ని ఆదర్శపు వెలుగులో వాస్తవంగా పునర్నిర్మించాలన్నది హేస్ నమ్మకం. 1892లో రచించిన ''మెర్లిన్'' కథలో సాహిత్యానికి జరుగుతున్న అన్యాయాన్ని ధైర్యంగా వివరించాడు. హేస్ పేరును ఇంతకుముందే నోబెల్ పురస్కారానికి ప్రతిపాదించారు. హేస్ అందరి ఆదరగౌరవాలను చూరగొన్నాడు. మ్యూనిచ్ నగరంలోని ఒకవీధికి ఆయన పేరు పెట్టబడింది. అతని నెన్నో గౌరవాలు ముంచెత్తాయి. ఇప్పుడు వాటన్నిటికీ తలమానికంగా నోబెల్‌సాహితీ పురస్కారం ప్రదానం చేయబడుతోంది.

హేస్ తనదైన పంథాలో సాహితీ సృజన చేశాడు. అంతరాలను బాహ్య వాస్తవాలలో ప్రతిబింబింప జేసిన హేస్ సౌందర్యపరంగా సత్యాన్ని నమ్మాడు. ''జీవితం తక్షణ మయింది, కళ నిర్మలమైంది.'' అన్న స్కిల్లర్ సత్యాన్ని తన జీవితంలోను రచనల్లోను హేస్ వ్యక్తీకరించాడు. అందం స్వేచ్ఛీకరించాలి, పునః సృష్టించాలి. అది వాస్తవాన్ని బానిసలాగ అనుకరించకూడదు; దుమ్ములోకి లాగకూడదు. దానికి ఉన్నత సామాన్యత ఉండాలి. హేస్ సౌందర్యాన్ని ఆ విధంగానే వ్యక్తీకరించాడు. అతడెన్నడూ నీతులు బోధించలేదు; మత బోధ చేయలేదు; ఎవరి మత భావనల్నీ గాయ పరచలేదు. అతడు మతంలో మౌఢ్యాన్ని కాక నియమాల్ని సమర్థించాడు. అతనికి సహిష్ణుత ఉంది. అతడు దివ్య ప్రేమను పొగిడాడు. తమ స్వభావాలకు నిజాయితీగా కట్టుబడిన మనుషులంటే హేస్‌కి ఇష్టం.

అనారోగ్యం వల్ల హేస్ ఇక్కడికి రాలేకపోయినా, ఎందరో పాఠకులకు ఆనందాన్నిచ్చిన రచనలు చేసినందులకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

★ ★ ★ ★ ★

ఆ సందర్భంగా ప్రొఫెసర్ ఆస్కార్ మోంటీలియస్ ఈ విధంగా అన్నారు - ''ఈ సంవత్సరపు నోబెల్‌సాహితీ పురస్కారాన్ని అందుకునేందుకు ఆ మహాకవి మనమధ్యకు వచ్చి, మనల్ని ఆనందింప

జేసేందుకు రాలేక పోయినందుకు బాధపడుతున్నాను. వారికి బదులుగా పురస్కార స్వీకరణకు వచ్చిన జర్మన్ మంత్రివర్యులు, కౌంట్ వాన్ ఫుక్లర్ గారిని కవిగారిని మేము ఎంతగానో గుర్తు చేసుకున్నామని తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.''

హేస్‌కు బదులుగా మాట్లాడిన మంత్రి రెండేళ్ళ క్రితం ఒక జర్మన్ కవితా తత్త్వవేత్తకు, ప్రస్తుతం ఒక స్వచ్ఛమైన కవికి నోబెల్ బహుమతిని ప్రదానం చేస్తున్నందుకు స్వీడిష్ అకాడెమికి కృతజ్ఞతలు తెలియ జేశారు.

## ఆత్మకథ

నేను 1830 మార్చి 15న బెర్లిన్‌లో జన్మించాను. మా నాన్న ప్రొఫెసర్. కె. డబ్ల్యూ.ఎల్. హేస్. మా అమ్మ జూలీ నీ సాలింగ్. నేను వారికి రెండో కుమారుణ్ణి. ఎనిమిది, పదహేడు సంవత్సరాల మధ్య వయసులో జిమ్నాసియంలో చదివాను. నా మిత్రులు ఇమ్మాన్యుయెల్ జీబెల్, ఫ్రాంజ్ కుగ్లర్‌ల ప్రోత్సాహంతో కవితా రచన ప్రారంభించారు. బాన్‌లో ఒక సంవత్సరం విద్యాభ్యాసం చేశాను. ఆ రోజుల్లోనే ప్రాచీన భాషాశాస్త్రం నుండి రోమాన్స్ భాషా శాస్త్రానికి మారాను. ఎఫ్. డేజ్ నా గురువు. 1852 ప్రారంభంలో డాక్టరేట్ డిగ్రీ సంపాయించాను. అదే సంవత్సరం శిశిర ఋతువులో ప్రష్యన్ సాంస్కృతిక మంత్రిత్వ శాఖవారి ఆర్థిక సహాయంతో రోమ్ వెళ్ళాను. ఒక సంవత్సరం పాటు దక్షిణ ఇటలీలో అనేక ప్రదేశాలు పర్యటిస్తూ లైబ్రరీలలో రోమాన్సు చదివాను. వీటినే 1856లో డబ్ల్యూ. హెర్ట్జ్ ''రోమాంటిస్కా ఇనెడిటా'' గా ప్రచురించాడు.

1853లో సాహితీ సృజన బాగా సాగింది. 1854లో నా రచనల్ని చదివిన బవేరియా రాజు మాక్సిమిలియన్ II, నా మిత్రుడు ఇమ్మాన్యుయల్ జీబెల్ సలహా మీద, సంవత్సరానికి 1000 గిల్డర్ల జీతంతో మ్యూనిచ్‌లో నాకొక పదవిని కల్పించారు. అప్పుడే కుగ్లర్ కుమార్తె మార్గరెట్‌ను వివాహం చేసుకున్నాను. మాకు నలుగురు సంతానం. 1862లో ఆమె చనిపోయింది. అయిదేళ్ల తరువాత మ్యూనిచ్‌కి చెందిన అన్నా స్కూబార్ట్‌ను వివాహమాడాను. నలభై నాలుగేళ్ళు మేం సంతోషంగా జీవించాము. నా మొదటి భార్య సంతానంలో ఇద్దరు పిల్లలు చనిపోయారు. నా నలభైయేళ్ళ జీవితానుభవాలను 'మెమొరీస్ ఆఫ్ మై యూత్ అండ్ కన్ఫెషన్స్'' గా వ్రాశాను. తరువాత నా జీవితం ప్రశాంతంగా సాగింది. ఆ జీవితాన్నంతా రచనా వ్యాసంగంలోనే గడిపాను.

నేను వ్రాసిన పుస్తకాలు - ''కలెక్టెడ్ వర్క్స్'' (1871-1910)36 వాల్యూములు, ''డ్రమెటిక్ వర్క్స్'' (1864-1905) 36 వాల్యూములు, నవలలు, నవలికలు, లిరిక్‌లు, ఎపిక్ కవితలు సీరిస్- I 12 వాల్యూములు, సిరీస్ II 40 వాల్యూములు, ''ఇటాలియన్ పోయెట్స్ సిన్స్ ది మిడిల్ ఆఫ 18th సెంచురీ'' (1871-1876) 5 వాల్యూములు.

ఇతర పబ్లిషర్లు ప్రచురించినవి :- ''ట్రజరీ జర్మన్ నావెల్లాస్' (1871-76) 24 వాల్యూములు, ''ట్రజరీ ఆఫ్ ఫారిస్ నా వెల్లాస్'' (1872-76) 14 వాల్యూములు, ''న్యూట్రెజరీ ఆఫ జర్మన్ నా వెల్లాస్'' (1884-88) 24 వాల్యూములు, ''జూసె కావెడా వైనావాస్ హిస్టరీ ఆఫ్ స్పానిష్ లిటరేచర్'' (1858).

★ ★ ★ ★ ★

పాల్ హేస్'(1830-1914) 1910లో బవేరియా రాజు ద్వారా నోబుల్‌మన్‌గా గుర్తింప బడ్డాడు. 1924లో అతని మరణం తరువాత అతని సంపూర్ణ సాహిత్యం పదిహేను విభాగాలుగా ప్రచురింపబడింది.

# విషమ పర్యావరణం నేటి మానవాళి సమస్య చర్చించిన నవల దృశ్యా దృశ్యం

–ప్రొ॥ పురుషోత్తమ రెడ్డి

చంద్రలత నవల 'దృశ్యాదృశ్యం' ఒకపర్యావరణ నవల. పర్యావరణ స్పృహ ఈ మధ్యనే అంటే ఐదు దశాబ్దుల లోపే, ఒక విస్పష్ట రూపాన్ని తీసుకొని మానవుని దృష్టిని ఆకర్షించింది. పర్యావరణ సమతౌల్యం లుప్తమైందని పారిసరిక కాలుష్యం ఎలుగెత్తి చాటింది. పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటే మానవుని మనుగడే ప్రశ్నార్థక మవుతుంది. ఈ సంగతిని గుర్తించిన ఎరిక్‌ఫ్రామ్ తన Art of lovingలో, మనిషి ఒకప్పుడు ప్రకృతిలో అభేదంగా ఉన్నాడు. దాని ఒడిలో పవళించి స్వర్గాన్ని చూశాడు. మాతృగర్భాశయ సుఖాన్ని పొందాడు. ఆ తరవాత మానవుడు చైతన్యం పొందినకొలదీ, తన అస్తిత్వం ప్రకృతి కంటె భిన్నమైనదిగా భావించి (Man is the only living being critically and painfully aware of his own existence)నప్పుడు తన అస్తిత్వమే తనకు ప్రశ్నార్థకమైంది. ఇలా ఎదిగిన (తరిగిన) మనిషి ప్రకృతిపై సమరం సాగించి, ప్రకృతి ఒడికి దూరుడై, తాటాకు, రెల్లు, ఆకుల మట్టిగుడిసెలను వదిలి, ప్రకృతిలో లభించని ఇనుము సిమెంట్ కట్టడాలలోకి సహజ వాయువు లభించని A.C. గదులలోకి మకాము మార్చి శాశ్వతంగా ప్రకృతికి దూరుడయ్యాడు. మళ్ళీ ప్రకృతిలోకి వెళ్ళాలంటే అక్కడ దేవతలు విచ్చుకత్తులతో, అగ్ని కీలలతో పహరా కాస్తూ ప్రవేశించనీయరంటాడు. ఎరిక్‌ఫ్రామ్ అటు ప్రకృతిలోకి వెళ్ళలేక, ఇక్కడ కృత్రిమ పరిసరంలో ఉండలేక మనిషి సతమతమవ్వడమే పర్యావరణ సమస్య అన్నాడు. - సంపాదకుడు

''ప్రకృతి పై మనం సాధించాలనుకుంటోన్న ఆధిపత్యం ఎలా పరిణమించబోతోంది? ఆ పట్టు ఎవరి గొంతు చుట్టూ బిగుసుకుంటోంది? ఇలాగే కొనసాగితే చివరకు ఏమి మిగులుతుంది?'' అన్న ముఖ్యమైన ప్రశ్నలతో మన ముందు నిలిచింది చంద్రలత నవల ''దృశ్యాదృశ్యం.''

ఇది ఓ మౌలిక ప్రశ్న.

ప్రకృతిలో అంతర్భాగమైన మానవ మనుగడకు సంబంధించిన ప్రశ్న. సమస్త భూమండలానికి సంబంధించిన ప్రశ్న.

పాశ్చాత్య సాహితీ ప్రపంచంలో ఇలాంటి ఆలోచనాధోరణి 60వ దశకంలోనే ప్రారంభమైంది. అందుకు మూలం ''రాకెల్ కార్సన్'' అనే అమెరికన్ రచయిత్రి రచించిన ''సైలెంట్ స్ప్రింగ్'' అన్న నవల.

అవి హరిత విప్లవం ముమ్మరంగా సాగుతున్న రోజులు. రైతులు విరివిగా వినియోగిస్తున్న DDT వలన పురుగులు నశించడం, ఆ విషపూరిత కీటకాలను తిన్న పక్షులు తీవ్ర ప్రభావానికి గురికావడం, ఆ పక్షుల గుడ్ల పెంకు పలుచన కావడం, క్రమంగా ఆ పక్షిజాతి కనుమరుగై పోవడం - ఇదీ నవల లోని కథ.

సెలయేరులా నిరంతరం ప్రవహిస్తూ ఉండవలసిన జీవన స్రవంతి ఇలా నిశ్శబ్దంగా అదృశ్యమై పోవడాన్ని - ఆమె ఆ నవలలో ప్రశ్నించారు.

---

ప్రొ॥ పురుషోత్తమ రెడ్డి, ప్రఖ్యాత పర్యావరణ ఉద్యమ కారుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి రాజనీతి శాస్త్రాచార్యునిగా పదవీ విరమణ చేశారు.

''ప్రకృతి ఉన్నది మనం ఆధిపత్యం వహించడానికే!'' అన్న ఆలోచన కలిగిన అమెరికన్ల ముందు ఒక కొత్త ప్రశ్న నిలబడింది. ''ప్రకృతి మన కొరకు, కానీ మనం ప్రకృతి కొరకు కాదా?''

ఆ నవల మిలియన్ల కొద్దీ కాపీలు అమ్ముడయ్యి అమెరికన్ బెస్ట్ సెల్లర్ అయ్యింది.

అమెరికన్లలో పర్యావరణ స్పృహను మేల్కొలిపినటువంటి ఆ పుస్తకాన్ని అమెరికన్ పౌరులు ఎంతో ఆదరించారు. ప్రభావితం చెందారు. ఆ ప్రభావం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రతినిధులను కూడా స్పందింపజేసింది. వారిలో ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తింది. అది -, ''అభివృద్ధి అంటే ఏమిటి?''

అప్పటి వరకూ - ''శాస్త్రం శాస్త్రం కొరకే... ఆవిష్కరణ ఆవిష్కరణ కొరకే'' అన్న ఆలోచనాధోరణి కలిగిన పాశ్చాత్యులు ఒక్కసారిగా కొత్త ప్రశ్న వేసుకున్నారు. ''శాస్త్రాలూ ఆవిష్కరణలూ ప్రకృతి పై చూపుతోన్న ప్రభావం ఏమిటి?''

అప్పుడు అక్కడి అన్ని రంగాలలోని నిపుణులు తమ తమ సబ్జెక్టులకు పర్యావరణ స్పృహను జోడించి పునరాలోచన ప్రారంభించారు. ఈ దిశలో వారి పరిశోధన ఎంతో విస్తృతంగా జరిగింది. ఆ క్రమంలోనే వారు ఓజోన్ పొర పలుచబడడం, భూమండలం వేడెక్కడం లాంటి అనేక సమస్యలను గుర్తించారు.

అప్పుడు మరొక ముఖ్యమైన ప్రశ్న వేసుకున్నారు - ''ఇంతకూ అమెరికా అభివృద్ధి చెంతున్నట్లేనా?''

ఈ అంశం పై ఒక సమగ్ర నివేదిక కొరకు అమెరికన్ ప్రభుత్వం అన్ని రంగాల ప్రముఖులకూ పిలుపు నిచ్చింది.

సరిగ్గా అదే కాలంలో అటు యూరప్‌లోనూ పునరాలోచన ప్రారంభమైంది. ప్రత్యేకించి జర్మనీలో బలమైన చర్చ మొదలయ్యింది. ''జర్మనీ ఏ దిశగా ప్రయాణిస్తోంది ?''

''శాస్త్రం శాస్త్రం కొరకే అంటూ - ఒక పరిమితి లేకుండా తీరూతెన్నూ లేకుండా మనం చేస్తోన్న పనులన్నీ అభివృద్ధేనా?'' అన్న ప్రశ్నలు వేసుకున్నారు.

అక్కడ అమెరికన్ మేధావివర్గం - ''ఎ రిపోర్ట్ టు యుఎస్ ప్రెసిడెంట్'' ను తయారు చేసింది. ఇక్కడ జర్మన్ మేధావులు తమ సమగ్ర నివేదికను తయారు చేసి వారి ప్రభుత్వం ముందు ఉంచారు.

ఈ నేపథ్యంలో 1987లో ఐక్యరాజ్యసమితి యొక్క ''వరల్డ్ కమిషన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్'' తన సమగ్ర నివేదికను సమర్పించింది. దానికి సారథ్యం వహించినవారు అప్పటి నార్వేజియన్ ప్రధానమంత్రి శ్రీమతి గ్రో హార్లెమ్ బ్రంట్‌లెండ్. ''బ్రంట్‌లెండ్ నివేదిక''గా ప్రఖ్యాతి గాంచిన ఆ నివేదిక ఈనాటి ప్రపంచ పర్యావరణ కార్యాచరణ సరళికి మార్గదర్శకం అయ్యింది.

''ఇది సమస్త భూమడంలానికి పొంచివున్న ముప్పు'' అని వారు ప్రకటించారు. వారు క్రోడీకరించిన అయిదు ప్రధానాంశాలు - 1. పలుచనవుతోన్న ఓజోన్ పొర 2. వేడెక్కుతోన్న భూమండలం 3. అంతర్థానమవుతోన్న జన్యుసంపద 4. విస్తరిస్తోన్న ఎడారులు 5. పొంచివున్న అణు ప్రమాదం.

అందుకు గల కారణాలను వారు ఇలా వివరించారు.

''ఇప్పటి వరకూ వివిధ దేశాల మధ్యన పోటీవలనగానీ, కంపెనీల మధ్య పోటీ వలనగానీ, కార్పొరేట్‌ల మధ్య పోటీ వలన గానీ - ఒకరిని మించి ఒకరు తమ పరిశోధనలను సాగిస్తూ వచ్చారు. పరిశోధన ఫలితాలను పరిణామాలను రహస్యంగా దాచారు. ఈ పోటీ ప్రపంచంలో ఒకరిని దాటి మరొకరు పోవాలన్న ఆతృత తప్ప పర్యావరణం పై తమ తమ పరిశోధనల ప్రభావాన్ని వారు పరిగణనలోకి తీసుకోలేదు. అలా అభివృద్ధి పేరిట - ఒకరికి తెలియకుండా ఒకరు - చివరకు మూకుమ్మడిగా .... పర్యావరణం పై దాడి చేశారు.''

''జరిగిన నష్టం జరిగింది. ఇకపై ఎలా ఉండాలి?'' అన్నది బ్రంట్‌లెండ్ నివేదికలో స్పష్టంగా ప్రతిపాదించారు.

''శాస్త్ర సాంకేతికపరిజ్ఞానం '' ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ''గా ఉండాలి. భవిష్యత్ సాంకేతిక విలువలు మనిషికి ప్రకృతికి పరస్పర సంబంధమై సమతూకంగా - సానుకూలంగా ఉండాలి. అభివృద్ధి అనేది శాశ్వతమైనదిగా ఉండాలి. సుస్థిరమైనదిగా ఉండాలి.''

ఈ ఆలోచనలను బలంగా ప్రతిపాదిస్తూ వచ్చినదే చంద్రలత నవల ''దృశ్యాదృశ్యం''

నిజానికి పర్యావరణ పరిజ్ఞానం ఒక ఆకస్మిక ఆవిష్కరణ కాదు. అది మానవ భావపరిణామ క్రమంలో ఒకతరం మరొకతరానికి అందిస్తూ వచ్చిన జ్ఞాన సంపద. అనుభవాల పట్టి. భిన్న ప్రాంతాలలో పరిణితి చెందిన మానవులు నాగరికతా పరిణామ క్రమంలో తమ పరిసర ప్రకృతితో మమేకమయ్యారు. ప్రకృతి పై ఆధారపడ్డారు, తల్లిపై బిడ్డలలాగా. ప్రకృతితో వారికి ఉన్న అనుబంధం, అనుభవం ప్రకృతిని అర్ధం చేసుకొనే క్రమంలో వారు గ్రహించిన రహస్యాలు, వారికి అబ్బిన జ్ఞానం - ఒక తరం నుంచి మరొక తరానికి అందిస్తూ వచ్చారు.

అమెరికాలో యూరోపియన్ వలసల తొలిరోజులలో ఒక ఘోరం జరిగింది. ప్రాచీన మానవ సమూహాలైన రెడ్ ఇండియన్లు మొదలైన ఆదిమవాసులను వారు తుడిచి పెట్టేశారు. వారితో పాటే వారికే తెలిసిన ఎన్నో ప్రకృతి రహస్యాలు మాయమయ్యాయి.

వేలాది ఏండ్ల స్థానిక ప్రకృతి ప్రధాన ఆదివాస సంస్కృతికి - ఆధునిక సాంకేతిక ప్రధాన అమెరికన్ సంస్కృతికి నడుమ ఏర్పడ్డ శాశ్వత శూన్యాన్ని - తరువాత తరం వారు గుర్తించారు. తప్పును తెలుసుకున్నారు. పునరాలోచనలో పడ్డారు. ఏమైనా, ఆ అమూల్యమైన ప్రాచీన జ్ఞానసంపద అమెరికన్లకు అందకుండా పోయింది.

అన్ని ఆదిమ సమాజాల లాగానే - వేలాది ఏండ్ల అనుభవాల సారం మన భారతీయ సంస్కృతి. భారతీయ పర్యావరణ జ్ఞానం ఎంతో విశిష్టమైనది. అది భారతీయుల నిత్య జీవన సరళిలో భాగమై పోయింది. ప్రకృతికి గల పరిమితులు వారికి తెలుసు. వారికి ఉన్న పరిమితులు వారికి తెలుసు. గాంధీజీ భారతీయ ప్రకృతి తత్వాన్ని ఎంతో స్పష్టంగా చెప్పారు. ''అందరి అవసరాలను ప్రకృతి తీర్చగలదు. కానీ కొందరి అత్యాశను తీర్చలేదు.'' ఇది భారతీయ నమూనా. ప్రకృతికి గల ఆ పరిమితిని గుర్తించ వలసిన అవసరాన్ని ''దృశ్యాదృశ్యం'' లో చంద్రలత చక్కగా రాశారు.

మన దేశంలో స్వతంత్రం వచ్చాక, అభివృద్ధి పేరిట - ఒక పొరపాటు జరిగింది. అప్పటికే అగ్రరాజ్య

ప్రధాన నిలబడుతోన్న అమెరికా రష్యాల మిశ్రమ ఆర్థిక విధానాలను యథాతథంగా మన నమూనాలుగా స్వీకరించారు. ఆ క్రమంలో ''భారతీయ నమూనా'' అన్నది ఒకటి ఉన్నది - అన్న ఆలోచన వారికి లేక పోయింది. ఆ విధంగా స్థానిక జ్ఞాన సంపద నిర్లక్ష్యం చేయబడింది. ''ఉత్తర అమెరికా నమూనా'' దాని పరిమితులతో సహా మన దేశంలో అడుగుపెట్టింది. భారతీయ నమూనా అదృశ్యమైంది. పర్యావరణ ప్రధాన భారతీయ సంస్కృతి పక్కకు నెట్టివేయబడింది. క్రమేణా అది కనుమరుగయ్యింది.

మరొక విషాదం ఏమంటే - ఆ తరువాతి కాలంలో పాశ్చాత్య దేశాలలో వస్తోన్న పునరాలోచనను మనం అందిపుచ్చుకోలేక పోవడం.

భారతీయులకు నూటికి నూరు శాతం పర్యావరణ స్పృహ ఉన్నది. కానీ భారత ప్రభుత్వానికి ఆ స్పృహ 1972లో స్వీడెన్‌లో జరిగిన ప్రపంచ పర్యావరణ అంతర్జాతీయ సదస్సు తరువాతనే కలిగింది.

అన్ని ఆదిమ సమాజాల లానే భారతీయ జీవనసరళి ప్రకృతితో సజీవ సంబంధం కలిగిన గొప్ప సంస్కృతి - ఎ సివిలైజేషన్ సింబయోసిస్ విత్ నేచర్. మనిషికి ప్రకృతికి మధ్యన ఉన్న ఆ అవినాభావ సంబంధాన్ని చంద్రలత ''దృశ్యాదృశ్యం''లో బాగా చిత్రించారు.

''ఆ అడవిని నమ్ముకున్నా కాయాపండు దక్కే .... ఆ ఏటిని నమ్ముకున్నా శాపారొయ్య చిక్కే-'' అంటోన్న భార్య మల్లమ్మ మాటలను - ''ఏటిలో చేప, అడవిలో చింతాకు కలిసి కడుపులోకి పోతోంటే '' - ఆమె భర్త సిద్దయ్య ఎలా కాదనగలడు?

ఆ విధంగా ఈ నవలలోని పాత్రలు రెండు జీవావరణాలపై ఆధారపడినవి. మొదటిది నది. రెండవది అడవి.

''మనిషికి మనిషికి, మనిషికి మట్టికి, మనిషికి పశువుకి మధ్య ఉన్న ఆ అనుబంధం ఆ ఆప్యాయత...'' తో పాటు చెట్టుకు పుట్టకు గట్టుకు ఉన్న సజీవ సంబంధాన్ని చంద్రలత చాలా సున్నితంగా ఆవిష్కరించారు. అంతటి అనుబంధాన్ని ఒక్కసారిగా తెంచుకోవాల్సి వస్తే...? ఆ ఎడబాటు ఆ దుఃఖం ఆవేదన - ఈ నవలలో చంద్రలత ఎంతో హృద్యంగా చిత్రించారు.

ఖండితవాసులు, ముంపువాసులు, శిఖంభూముల రైతులు, గిరిజనులు, మత్స్యకారులు, వ్యవసాయదారులు, బోయవారు, నీరేటివారు, జానపద కళాకారులు - మరెందరో నదితో అడవితో ముడిపడినవారు ఈ నవలలో ఉన్నారు. ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, పరిశోధకులు - వీరెవరూ కాని సామాన్యులు ఈ నవలలో ఉన్నారు. మేధావులు, ఆలోచనా పరులు ఉన్నారు. సంకుచిత దృష్టి, స్వార్థభావం, బంధుప్రీతి, అవినీతి అన్నీ ఉన్నాయి.

ఈ నవలలోని అక్షత లాంటి ఎంతోమంది పరిశోధకులు భారతీయ పర్యావరణ సంస్కృతిని అధ్యయనం చేయడానికి మా వద్దకు వస్తూ ఉంటారు. ఈ నవల అక్షతతోపాటుగా ఆమె కుటుంబంలోకి ఊరిలోకి సులువుగా సాగిపోయింది.

నవలలోని భాష, పల్లె, సంస్కృతి నా బాల్యాన్ని, మా ఊరిని జ్ఞాపకం చేశాయి.

ఈ నవలలో నాకు మరింత సన్నిహితంగా తోచిన అంశం - పశుపాలన.

ఆలమందలకు ప్రసిద్ధమైన అచ్చంపేట తాలూకా నడెంపల్లి మా స్వగ్రామం. మా చిన్నతనంలో ఎకరా పొలం గల రైతు వద్దనైనా కనీసం నూరు వరకు పశువులు ఉండేవి. కేవలం పశువుల మీదే ఆధారపడి బతికేవారూ ఉండేవారు. మా అచ్చంపేట గిత్తలు మధ్యస్తపు ఎత్తుతో బలిష్టంగా ఉండి రోగ నిరోధక శక్తి కలిగి సేద్యపు పనులకు ప్రసిద్ధి. పశువులను అడవికి మేతకు తోలుకెళ్ళడం, గిరిజనులతో పల్లెవారికి ఉన్న సంబంధాలు, ఇబ్బందులు వచ్చినపుడు ఊరిలోని పెద్దరైతుకే తమ పశువులనుమేత కొరకు అప్పజెప్పడం, ఆ పశువుల చుట్టూ అల్లుకున్న అనుబంధాలు - ఇవన్నీ మా ఊరిని నా కళ్ళముందు ఉంచాయి.

అయితే, ఈ నవలలో లాగానే ఇప్పుడు మా ఊరిలో పశుసంపద అంతరించి పోతోంది. ఈ పశువులు పేదరైతుల పనిముట్లు. ప్రధాన జీవనాధారం. వాటి మాంసం ఎగుమతి కొరకు విచక్షణా రహితంగా జరిగిన పశువధను వ్యతిరేకిస్తూ - అందుకు ఉద్దేశించిన ''యాంత్రిక వధ్యశాల'' పైమేము ఉద్యమం నిర్వహించాం.

నిజానికి, స్వతంత్ర భారతంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు మూలకారణం - పర్యావరణం. అందులోనూ తెలుగునాట జరిగిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలన్నీ విజయగాథలే. అది పటాన్ చెరువు కాలుష్య సమస్య కావచ్చు. నల్గొండ ఫ్లోరోసిస్ కావచ్చు. అణుధార్మికతకు వ్యతిరేకత కావచ్చు.

అయితే, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన ఈ ప్రజా ఉద్యమాలపై మన సాహితీ ప్రపంచం స్తబ్ధత వహించడం కొంత నిరాశగానే ఉంది. 1992లో ''ధరిత్రీ సదస్సు'' జరిగిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల లోనూ పర్యావరణ ప్రధాన పునరాలోచన జరుగుతోంది. మన రచయితలు ఇంకా ఆ స్పృహను అందిపుచ్చుకోలేదు. ఈ దిశగా ఎన్నో ఆలోచనలు, ప్రతిపాదనలు వారి రచనలుగా రావాలని ఆశిస్తున్నాను. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా ఇంతటి సంచలనాత్మక పునరాలోచనకు మూలమైంది రాకెల్‌కార్సన్ గారి నవల ''సైలెంట్ స్ప్రింగ్''. ఆంధ్రప్రదేశ్‌లో సరిగ్గా అలాంటి సంచలనాత్మక పునరాలోచనకు ''దృశ్యాదృశ్యం'' స్ఫూర్తి, ప్రారంభం కాగలదని నా విశ్వాసం.

1996లో ''రేగడివిత్తులు'' నవలలో చంద్రలత హరితవిప్లవం పరిణామాలను విశ్లేషించారు. ఇప్పుడు జలావరణం గురించిన సమగ్ర రచన చేయడం ఎంతో సంతోషం.

విశ్వదృష్టితో విశ్లేషించి స్థానికస్పృహతో రచించిన ఈ ''దృశ్యాదృశ్యం'' అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సంపూర్ణ పర్యావరణ నవల. ఈ విధంగా చంద్రలత ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ''ఉన్నత శ్రేణి పర్యావరణ మిత్ర రచయిత్రి''గా ఆవిర్భవించారు.

మన ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు మన ముందు ఉన్న ప్రధాన అంశం - నీరు.

అనాదిగా మనం నీటి కొరకు నదిపై ఆధారపడి ఉన్నాం. ''కొండకొన నుండి కడలి అలదాకా.... భూగర్భ అంతర్వాహిని నుండి ఉత్తుంగ జల తరంగిణిదాకా'' నది విస్తరించి ఉంది. మనలాగానే మన చుట్టూ ఉన్న సమస్త చరాచర జీవరాశి నదితో ముడిపడి ఉంది.

''ఆ నదులు రానురానూ ఎందుకు చిక్కి-శల్యమవుతున్నాయి? ఆ నదీగర్భం ఎందుకు బీటలు వారుతున్నది?'' అన్న ముఖ్యమైన ప్రశ్నలు వేస్తున్నది ''దృశ్యాదృశ్యం.''

నది గురించి ప్రస్తావిస్తే ఆనకట్ట గురించి మాట్లాడక తప్పదు. ఎందుకంటే ''పెద్ద ప్రాజెక్టులను కడితేనే అభివృద్ధి'' అన్న ప్రచారం ప్రపంచం అంతటా జరిగింది.

''నదులపై ఆనకట్టలు ఎలా కట్టాలి? ఎక్కడ కట్టాలి? ఎంత ఎత్తున కట్టాలి? అసలు కట్టాలా వద్దా?'' అన్న చర్చ కొద్దికాలంగా అంతర్జాతీయంగా జరుగుతుంది.

''ఆనకట్ట ఎత్తు ఆ ప్రాంతపు అధిక వరద నీటిమట్టం **(Highest Flood Level)** తో సమానంగా ఉండాలి. దీని చేత కొత్తగా ముంపుకు గురయ్యే ప్రదేశం ఉండదు. అందులోనూ నదీ ప్రవాహ గమనాన్ని బట్టి ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టాలి. నదీ పరివాహక పర్యావరణాన్ని కదిలించని విధంగా ఆ నిర్మాణం జరగాలి. అది గ్రహించకుండా తీసుకొనే విచక్షణా రహిత నిర్ణయాల వలన ఎంతో అరుదైన, విలువైన ప్రకృతి సంపదను, జన్యువైవిధ్యాన్ని మనం శాశ్వతంగా కోల్పోతాము.'' ఇదీ ఆ చర్చల సారాంశం.

ఎంతో వివాదస్పదమైన అంశాన్ని, సున్నితమైన విషయాన్ని నవలావస్తువుగా స్వీకరించడమే ఒక సాహసం. ఆ విషయాన్ని ఆమూలాగ్రం అధ్యయం చేసి ... ఒక సమర్ధవంతమైన సమగ్రకాల్పనిక రచనగా రూపుదిద్దడం ఎంతో కష్టం. చంద్రలత ఆ పని చక్కగా చేశారు.

రచయిత్రి అధ్యయనం లోని శ్రమ, ఆలోచనలోని స్పష్టత, విషయంపై తాదాత్మ్యత ఈ రచన ఆద్యంతమూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధ్యయనాన్ని, ఆలోచననూ, అనుభూతిని సున్నితంగా వ్యక్తీకరించగల రచయిత్రి ప్రతిభ నన్నెంతో ఆకట్టుకుంది.

తక్షణ ఫలితాలు కనబడే ఆర్థిక సంబంధ విషయాలను విశ్లేషించడమూ, రాసి మెప్పించడమూ తేలిక. కానీ ఒక శ్వాశత సుదూర ఫలితాన్ని ప్రతిపాదిస్తూ రచన చేసి పాఠకులను మెప్పించడం అంత తేలిక కాదు. సంపూర్ణ జలావరణ విశ్లేషణకు నవలారూపం ఇచ్చి చంద్రలత ఆ పనిని సునాయాసంగా చేశారు. ఇది ఒక నదికో ఆనకట్టకో పరిమితమైన రచన కాదు. సమస్త జలావరణానికి సంబంధించిన రచన. ఇది ఒక ఆరోగ్యకరమైన పునరాలోచనకు ఆరంభం కావాలని ఆశిస్తున్నాను. ''దృశ్యాదృశ్యం'' భవిష్యత్ రచనా విధానాన్ని పర్యావరణ ప్రభావితం చేయగలదన్న నమ్మకం నాకు ఉంది.

''దృశ్యాదృశ్యాం'' లోని కేశవ పాత్ర ద్వారా రచయిత్రి ఇలా స్పష్టం చేశారు.

''ఈ కరువు ఈ కాటకం మయాస్పష్టం. నేను సర్వస్వం నాకే సమస్తం అన్న అహంభావం లోంచి పుట్టిన ప్రకంపనాలు ఈ కరువూకాటకాలు.''

''మనిషికి మనిషికి, మనిషికి ప్రకృతికి నడుమ సామరస్య సంబంధాలతో నిండిన మానవ విలువను ఆవిష్కరించుకోకపోతే మన సర్వనాశనం తప్పదు. ప్రకృతి విలయతాండవం తప్పదు. విధ్వంస హేల తప్పదు.''

''జలవనరుల వినియోగానికి జలసంరక్షణకూ నడుమ సంతులిత సమీకరణమే ఆధునిక జలసంస్కృతి!''

# డచ్ చిత్రకారుడు వెర్మీర్ : ఒక నివాళి

## (కళ - దాని స్వరూపం)

- కాండ్రేగుల నాగేశ్వరరావు

అది సెప్టెంబరు నెల 1946వ సంవత్సరం. తైల వర్ణ చిత్రాల చరిత్రలో ఒక మహాద్భుతం జరిగింది. ప్రముఖ 'డచ్' చిత్రకారుడయిన వెర్మీర్ (Vermeer) చిత్రాలు కొన్ని కొత్తగా నగరంలో లభించాయి. మొదట్లో అవి వెర్మీర్ వేసిన చిత్రాలు అవునా కాదా అనే సందేహం ఉన్నప్పటికీ, ఉద్దండ చిత్రకారులు, కళా నిష్ణాతులు, కళా విమర్శకులూ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత అవి వెర్మీర్ వేసినవేనని నిర్ణయించారు. ఆనాటి వరకూ వెర్మీర్ వేసిన చిత్రాలు లభ్యమైనవి 40 మాత్రమే. ప్రపంచంలో వందల కొద్దీ వున్న మ్యూజియం అధికారులు, కళా ఖండాలను సేకరించేవారు. ప్రపంచం నలుమూలల నుంచి ఆమ్స్టర్‌డమ్ చేరుకున్నారు. కొత్తగా వచ్చి చేరిన తైల వర్ణచిత్రాల ఖరీదు లక్షలకూ, కోట్లకూ పరిగెత్తింది. డచ్ దేశస్తుల మధ్యతరగతి జీవన సంరంభాలను వేనోళ్ల చాటి చెప్పిన అతని కళావైభవానికి నీరాజనాలు పట్టారు.

ఇంతలోనే రంగస్థలం మారిపోయింది. Van Mangareen అనే సాధారణ డచ్ చిత్రకారుడు నిజానికి ఈ చిత్రాలు వెర్మీర్ వేసినవి కావని వెర్మీర్ యొక్క రేఖా విన్యాసం, ప్రత్యేకతో కూడిన పసుపు, నీలం రంగుల యొక్క కలయికను తాను సుదీర్ఘ అభ్యాసం ద్వారా వెర్మీర్ చిత్రాలను పోలిన నకళ్ళను తయారు చేసినట్లు ప్రకటించి నిరూపించి అందరినీ దిగ్భ్రాంతి గావించాడు. అంత వరకూ కోట్లకు వెనుకాడకుండా ఆ తైల వర్ణచిత్రాలను కొనాలను కున్న వాళ్ళంతా అవి వెర్మీర్ వేసినవి కావని తెలిసాక వెనుకంజ వేశారు. కోట్ల ఖరీదు చేసే చిత్రాల విలువ ఒక్క రోజులో వందలకూ వేలకూ దిగజారింది.

ఈ సంఘటన కళా జగత్తులో అనేక కీలకమైన ప్రశ్నలకు తెర ఎత్తింది.

1. 17వ శతాబ్ది వాడైన వెర్మీర్ వేస్తే గొప్ప చిత్రాలు. అదే నాణ్యత ప్రమాణాలతో సమకాలీన శతాబ్దం. (1946)లో Van Mangreen వేస్తే మాత్రం అవి సాధారణ చిత్రాలే.

అంటే కళకు ప్రాచీనతే ప్రామాణికమా? ఎంత ప్రాచీనమైతే అంత గొప్ప కళా ?

2. ఈ నాటి సాధారణ చిత్రాలు కొన్ని వందల సంవత్సరాల తరువాత గొప్ప అసాధారణ చిత్రాలవుతాయా? వాటి ఖరీదు అనూహ్యంగా పెరుగుతుందా?

కళకు ప్రమాణికత ఏమిటి? దీనికి విలువ కట్టే తూనిక రాళ్ళు, కొలబద్దలూ, ఏమిటి? ఎవరి వద్ద వున్నాయి? ఎవరో కొందరు బుద్ధి జీవులు మెచ్చుకుంటేనే కళా? లేకపోతే కాదా? మేధో జీవులమధ్య భిన్న స్వరాలు వుండవా? పికాసో చిత్రాలు అందరికీ ఒకే రకంగా అర్థమవుతాయా ?

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

Aldous Huxly తాజ్ మహల్‌ను చూసి ఇంత వికారమైన నిర్మాణాన్ని నేను ఎక్కడా చూడలేదన్నాడు. మరొక కవి, ఇది కాలం చెక్కిలి పై గానం చేస్తున్న కన్నీటి బొట్టు (A melody in tear glazing on the cheeks of time)గా భావించాడు. మేధో జీవులలో ఇంత వైవిధ్యం ఎందుకు? ఈ ప్రశ్నలన్నీ మరిన్ని ప్రశ్నలకు తావిస్తున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు వున్నా అవి సమగ్ర మైనవి కావు. సర్వకాల సర్వావస్థలలోనూ నిలదొక్కుకునే శాశ్వత సత్యాలు కావు. అయితే వీటికి ఈనాటి ప్రమాణాలను బట్టి కొంతవరకు మౌలికమైన సమాధానాలు రాబట్టవచ్చు.

ఈ జగత్తులో దేనికీ స్థిరత్వం లేదు. అణువు నుంచి బ్రహ్మాండం దాకా అంతా చలిస్తుంది. కాలం మారుతూ వుంటుంది. కొత్తకొత్తపరిశోధనలు పాతనమ్మకాలను పక్కన పెడుతుంటాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా కొత్త కొత్త ఆలోచనలు మనం సంతరించుకుంటూ ఆదిశగా అజ్ఞానాన్ని పారదోలుకుంటూ, శాశ్వత సత్యాన్ని అన్వేషించుకుంటూ ప్రయాణం సాగించాలి అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. సత్యం ప్రాతిపదికనైనే నవ్యచింతన ప్రారంభం కావాలి. అది లేనిదే నవజీవనం లేదు. ఈ నవ్య చింతనే కళాకారుని వెన్నెముక. ఈ కళాకారులంతా ఆవిధమైన దృక్పథంతో ఉన్న దార్శనికులే. వర్తమానంలో జీవిస్తూ భవిష్యత్తుకు ప్రాతినిత్యం వహిస్తాడు. నిజమైన కళాకారుడు.

మాథ్యూస్ ఆర్నాల్డ్ కళను నిర్వచిస్తూ ఇలా అంటాడు.

కళాకారులంతా సామాన్య మానవులకంటే భిన్నమైనవారే కాదు; మీదు మిక్కిలి తెలివైన వారుకూడా. మైఖేల్ ఎంజలో నీలి ఆకాశంలో తేలి పోతున్న ఒక తెల్లటి మబ్బు తునకలో creation of man అన్న చిత్రాన్ని లీలగా గుర్తించి అదే కాంపోజిషన్‌తో చర్చి గోడలలో చిత్రించాడు. మనం ఎన్నిసార్లు ఆషాఢ మేఘాలను చూడలేదూ? కానీ మనలో ఆ స్పందన ఏది? కళాకారులందరిలోనూ కొట్టొచ్చినట్లు కనుపడేది ఈ సృజనాత్మకతే. ఇదే వారిని మిగిలిన వారికంటే భిన్నంగా నిలబెడుతుంది. మైఖేల్ ఎంజిలో, రాఫెల్, డావిన్సీ మొదలైన వారి చిత్రాలలో కనబడే నవ్యత అంతకు ముందు లేదు. వారికి ముందు చెప్పుకోదగ్గ చిత్రకళా శాస్త్రం లేదు. ఇంకా చెప్పాలంటే వాళ్ళకు ముందు దాదాపు ఒక శూన్యం వుంది. దాని నుంచి ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలతో కూడిన ఒక చిత్ర కళా ప్రపంచాన్ని వాళ్ళు మన ముందు ఆవిష్కరించారు. అందుచేతనే వాళ్ళు వైతాళికులుగా నివాళులు అందుకున్నారు.

డచ్ చిత్రకారుడైన వెర్మీర్ (క్రీ.శ. 1632-75) కాలంవాడు.

అతనికి 250 సంవత్సరాల తరువాత వచ్చినవాడు వెన్ మీజెరెన్ వెర్మీర్‌కు ముందు ఉన్న చిత్రకళా వారసత్వం అతితక్కువ. అదే వెన్ మీజెరెన్ కాలం నాటికి అది సుసంపన్నమైంది. వెర్మీర్ తైలవర్ణ చిత్రాలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నవి. డచ్ ఇంటి ప్రాంగణాలలో దోబూచులాడే నీరెండ వెలుతురూ, చీకట్ల సమన్వయానికి అతని చిత్రాలు అద్దం పడతాయి. ప్రశాంతమైన జీవనశైలి, నిర్లిప్తతతో కూడిన స్త్రీల యొక్క సున్నితమైన భావోద్వేగ్నత కవితాత్మకంగా అతను కాన్వాస్‌పై గానం చేయించాడు.

అతని ముందున్న చిత్రకారులెవ్వరూ ఈ అంశం పై దృష్టి సారించలేదు. అందుచేతనే ప్రఖ్యాత పత్రిక Readers Digest చిత్ర కళకు సంబంధించి 38 మంది చిత్రకారులను మాస్టర్స్‌గా (వైతాళికులుగా) గుర్తించింది. అందులో వెర్మీర్ ఒకడు. నిజానికి వెర్మీర్ తన జీవిత కాలంలో ఏనాడు గుర్తింప బడలేదు. చిత్రకారులలో అతని సమకాలీనుడైన వేన్ ఐక్ (Van Eyek) ఎంతో గుర్తింపు పొందాడు. వేన్ ఐక్ దృష్టిలో మాత్రం వెర్మీర్, Rembrandt తరువాత అంతటి గొప్పవాడు. అతను వెర్మీర్‌ను ఎంత ప్రశంసించినా ఆనాటి సంఘం అతినికి కనీస గుర్తింపు కూడా ఇవ్వలేదు. 200 సంవత్సరాలు గడిచిన తరువాత గాని వెర్మీర్ గొప్ప తనం ప్రజలకు అర్థం కాలేదు. కళాజగతిలో తన కాలం కంటే ఎంతో ముందు ప్రయాణం చేయటమే అతను చేసిన తప్పు. ఇంతటి మహా చిత్రకారుని వ్యక్తిగత జీవితం గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. ప్రతి విషయాన్ని, విలువల్ని ఆర్థికంగా మాత్రమే అంచనా వేసే ఈ అర్థ ప్రపంచంలో చేతిలో చిల్లు కానీ లేక అప్పుల బాధతో తన 43 యేట మరణించిన ఇతని గురించి ఎవరు పట్టించుకుంటారు? మరణించేనాటికి అతనికి 11 మంది పిల్లలు. అతని భార్య అప్పుల వాళ్ళకు ఈనాడు కోట్లు ఖరీదు చేసే కళాఖండాలను ఇచ్చి అప్పు సరిపెట్టింది.

ప్రపంచంలో సృజనాత్మక వుండి ఏదైనా సాధించగలిగినవారు కొద్దిమంది మాత్రమే. కానీ ఆ సృజనాత్మక ఫలాన్ని అనుభవించేవారు కోకొల్లలు. వెర్మీర్ సృజన కలిగిన నిజమైన కళాకారుడైతే, వెన్‌మీజెరెన్ నకళ్ళు మాత్రమే చేయగల సాధారణ పెయింటర్. ఈ తేడాయే వాళ్ళ కళారూపాల విలువలను నిర్ణయించేది.

వెర్మీర్ తన సమకాలీన కాలంలో గుర్తింప బడకుండా వుండడానికి ఇప్పుడు మనం కారణాలు అన్వేషించాలి. ప్రతి కళకూ మూడు ముఖ్య పార్శ్వాలు వుంటాయి. మొదటిది కళాసృష్టి. మానవునికి మనస్సు వుంటుంది. ఈ మనస్సు ఒక విషయాన్ని గ్రహించినపుడు కలిగే స్పందనే అనుభూతి. ఈ అనుభూతి, దివ్యానుభూతిని కలిగించ గలిగితే ఆభావం, రూపం, స్పర్శ, రుచి, శబ్దం ఇవన్నీ కళలుగా రూపు దిద్దుకుంటాయి. అప్పుడే కళాకారుడు తనకు తెలిసిన మాధ్యమం ద్వారా కళాసృష్టిగావిస్తాడు. ఇక రెండవది కళా సాధన. కళారాధకుడు తన స్థాయిని బట్టి కళాసృష్టిని తగు రీతిలో ఆనందిస్తాడు. ఇక మూడవదీ, అతి ముఖ్యమయినదీ కళా సమీక్ష. ఈ సమీక్షకుడు కళలోని మంచి చెడులను విశ్లేషించి ప్రజల ముందుంచుతాడు. దీని ద్వారా మరింత కళాసాధన సాధ్యమవుతుంది. ప్రతి కళ వెనుకా ఒక అజరామరమైన సౌందర్య దృష్టి వుంటుంది. ప్రతి కళాకారుడూ ఆ అత్యున్నత సౌందర్యాన్ని తాను స్వాధీనం చేసుకున్నానని అనుకుంటాడు కానీ, అంతకంటే ఎక్కువగా ఆ సౌందర్యం అతనిని వశ్యుని చేస్తుంది. ప్రాథమికంగా ప్రారంభమయినపుడు కళాసృష్టి వ్యక్తిగతం, ఆత్మాశ్రయము మాత్రమే. దానిని పది మందికీ పంచి ఆ కళకు సార్వజనీత ఆపాదించడానికి ప్రోద్బలం గావించ గలిగినవాడే సమీక్షకుడు. సమీక్షకుని ద్వారనే కళపారదర్శకం అవుతుంది. కళాకారునికీ, కళాస్వాదకునికీ మధ్య నున్న తెరలు తొలగించ గలిగిన వాడే నిజమైన సమీక్షకుడు.

వెర్మీర్ విషయంలో మరొక చిత్రకళా వైతాళికుడైన వాన్‌గో విషయంలో కళావిమర్శకుల యొక్క దారుణ వైఫల్యం ఫలితంగా రెండు మహోన్నత జీవితాలు విషాదాంతంగా ముగిసాయి.

(విన్సెంట్ వాన్‌గో చిత్రాలు ఈ మధ్య 32 కోట్ల రూపాయిలకు అమ్ముడు పోయినాయంటే మనకు ఆశ్చర్యమేస్తుంది. కనీసం కాన్వాస్. రంగుల ఖర్చులైనా రాబట్టుకోవాలనే అతని ప్రయత్నాలు వ్యర్థమై చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు).

గొప్ప కళాకారుడు అనిపించుకోవడానికి ముఖ్యంగా కావలసింది మౌలికమైన సృజనాత్మకత, నవ్యత. ఈ రెండూ ఎంత హెచ్చుస్థాయిలో వుంటే అతను అంతగొప్ప కళాకారునిగా గుర్తింపబడతాడు. అయితే ఇవి రెండూ చాలవు. (1975 ప్రాంతంలో జరిగిన ఢిల్లీ Biennel లో 5 అడుగుల పొడవు 4 అడుగుల వెడల్పు గల తెల్లటి కాన్వాస్ గుడ్డపై రెండు కాల్చిన చపాతీలు పైన ఒక మూలగా ఒక దాని ప్రక్కన మరొకటి పేర్చబడింది. ఇది ఒక నవ్యతతో కూడిన భావం మాత్రమే. ఆనాడు అత్యంత ప్రతిష్ఠాకరమైన Binnel లో చోటు సాధించగలిగినా దీనికి విశ్వజనీనత లోపించటము వలన ఆ సంవత్సరము మటుకే దాని గొప్పదనం పరిమితమైనది) పై రెండు గుణాలతో పాటు అతని సృష్టి సార్వజనీనమైన సత్యంతో, సామాజిక అభివృద్ధి పరంగా కలకాలం నిలబడే విలువలు కలిగి వుండాలి. ఇది లోపించిన నాడు పైన చెప్పబడిన రెండు గుణాలు వున్నప్పటికీ కళ సంపూర్ణం శాశ్వతం కాజాలదు. విశ్వశ్రేయస్సు కోరని సౌందర్యం మృతప్రాయమైనది.

మేధావులందరూ కొన్ని మౌలిక మైన విషయాలలో ఏకీభవించిన కొన్ని చిన్న విషయాలలో వారి మధ్య అభిప్రాయ బేధాలుంటాయి. అందుచేత మనం సామాన్యంగా చాలాసార్లు చూస్తూ వుంటాము, చిత్రకళ ఛాయగ్రహ ప్రదర్శనలలో మొదటి బహుమతి పొందిన వాటికంటే, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వాటిపట్ల వీక్షకులు ఎక్కువ ఆకర్షించబడతారు. అంతమాత్రం చేత మేధావుల నిర్ణయాన్ని తప్పు పట్టడానికి లేదు. ఏదో ఒకళ్ళిద్దరు విషయంలో పొరపాటు జరిగినా చాలాసార్లు వీళ్ళ నిర్ణయం న్యాయ పరంగానే వుంటుంది. ఇదే విషయాన్ని Allan Rand తన Founrain Head అనే నవలలో సృజించింది. ఆ నవలలోని కథా వస్తువు Howard Rorch అనే Architect కు సంబంధించినది. అతను తాను అనుకున్న రీతిలో నిర్మాణం సాగిస్తాడు. సమాజం మాత్రం తాను కోరిన రీతిలో నిర్మాణం కావాలని కోరుతుంది. అత్యుత్తమమైన నైపుణ్యంకంటే సగటు సృజనాత్మకతకే ప్రాధాన్యత నిచ్చే ప్రపంచంతో తనకు నిమిత్తం లేదని తనకు నచ్చిన విధానంతో రాజీలేని విధంగా అతను నిర్మాణాన్ని చేబడతాడు. నిజానికి నిజమైన కళాకారుడెవ్వడూ ఎప్పుడూ రాజీపడడు. ఎంత తీవ్రమైన పరిస్థితి వచ్చినప్పటికీ తన కళను దాసోహం చేసుకోలేడు. ఈ భావనతో ఆ నవల ముగుస్తుంది. చివరగా ఒక్కమాట.

జీవితం నిరంతరమైన అన్వేషణ. ఈ అన్వేషణలో సత్యానికి దగ్గరగా రావటమే కళ యొక్క పరమార్థం. మన చుట్టూ వున్న ప్రకృతీ నిజమైన కళానియంత. రా. వి. శాస్త్రి మాటలలో చెప్పాలంటే సాహిత్యమే కాదు ఏ కళా ప్రక్రియయైన చెడుకి సాయం మంచికి హాని చేయకూడదు.

# కాలుష్యం - ఎదురవుతున్న ప్రమాదాలు - నివారణలు

- సి.వి. సర్వేశ్వర శర్మ

ప్రాణి కోటిలో తెలివైన మానవుడు సాటి ప్రాణులని దయకూడా లేకుండా వాటిని పొట్టన పెట్టుకుంటున్నాడు. అడవులు నరకడం, తమ అందచందాలకు బాహ్య అలంకరణకు, తన ఆహారం కోసం విపరీతంగా తోటి ప్రాణులను సంహరించేస్తున్నాడు.

ఇది ఇలా ఉండగా అభివృద్ధి, పారిశ్రామికీకరణ పేరిట ప్రకృతి సంపదను విచక్షణా రహితంగా వినియోగించుకుంటూ, దానిని తిరిగి పూరించుకునే ప్రయత్నం చేయకపోవడం మానవునితో సహా సమస్త జంతు జాలానికి శాపంగా పరిణమిస్తోంది.

భావితరానికి పచ్చని వృక్షసంపద, కలుషితం లేని నీరు, పోషకపదార్థంగల ఆహారం లభించదేమోనని భయపడుతున్నారు పర్యావరణ శాస్త్రవేత్తలు.

కాలుష్యం పడగ నీడల్లో మానవాళి మనుగడ సాధించాలా? ఫ్యాక్టరీ గొట్టాల నుండి వచ్చే విషవాయువులు ఇంటి చూరును కప్పేస్తూ ఉంటే ఎలా? పెరుగుతున్న జనాభా, పరిశ్రమల స్థాపన, పరిమితి వనరులు ఇవన్నీ పర్యావరణాన్ని సవాలు చేస్తున్నాయి.

ప్రకృతిపై మనం అనేక రకాలుగా దాడిచేస్తున్నందున అది మరొక రూపంలో మనపై పగుడుతోందేమో అనిపిస్తోంది. ఫ్యాక్టరీల కాలుష్యం పర్యావరణాన్ని ప్రధానంగా దెబ్బతీస్తోంది. తోళ్ళ పరిశ్రమ, జౌళి, నూలు పరిశ్రమలు, ఎరువులు, కాగితం, పెట్రోకెమికల్ ఫ్యాక్టరీలు వదిలే రద్దు పదార్థాలు, విషపదార్థాలు నీటి కాలుష్యానికి ప్రధాన కారణాలుగా వున్నాయి.

ఈ విషపదార్థాల వల్ల నీటిలో ఉండాల్సిన ఆక్సిజన్ తగ్గిపోతోంది. ఫలితంగా పెక్కు జలచరాలు, నీటి మొక్కలు ఆక్సిజన్ సరిపోక నశించి పోతున్నాయి.

**వ్యాధులు**

ఫ్యాక్టరీలు, మోటారు వాహనాలు గాలిలోకి వదులుతున్న వాయువులవల్ల వాతావరణ కాలుష్యం అవుతోంది. ఈ కాలుష్యం వల్ల బ్రాంకైటీస్, ఆస్త్మా, ఊపిరితిత్తుల కాన్సర్ వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి.

వాతావరణంలో దుమ్ముధూళి మనిషి శరీరంలోకి బ్యాక్టీరియాను తీసుకుపోతున్నాయి. వాహనాలు, భవన నిర్మాణాలు, సరుకుల లోడింగ్ - అన్‌లోడింగ్ వల్ల వాతావరణం దుమ్ముధూళితో నిండి 'డస్ట్ ఎలర్జీ' పేరుతో మనిషికి వస్తున్న వ్యాధులు ఎన్నెన్నో. వీటికి నివారణోపాయాలుగా వాహనాలు తక్కువ వేగంతో ప్రయాణం చేయాలి. భవన నిర్మాణ సమయంలో దుమ్ములేవకుండా నీళ్లు వెదజల్లుతూ ఉండాలి. తక్కువ ఎత్తులో లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం తరుణోపాయం.

**కలుషిత మవుతున్న సముద్రాలు**

రెండున్నర దశాబ్దాల క్రితంవరకు ప్రపంచంలోని సముద్రాలన్నీ చెప్పుకోతగినంత స్వచ్ఛంగానే

---

సి.వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్,
కృష్ణమూర్తి వీధి, అమలాపురం - 533 20, తూ॥గో॥జి॥ ఫోన్: 98856 - 232045

ఉండేవి. మనిషి స్వప్రయోజన కాంక్ష అధికమయ్యే కొలది వాటిలో కల్మషం అనంతంగా పేరుకు పోతూ వచ్చింది.

నిత్యం నదుల ద్వారా, వర్షాల ద్వారా కొన్ని లక్షల కోట్ల టన్నుల చెత్తచెదారం, పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు, రసాయన కాలుష్యాలు సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తున్నాయి. సముద్ర గర్భంలో నివసించే జంతువుల, మొక్కల, ఇతర జీవాల మీద ఈ కాలుష్య ప్రభావం ప్రసరించి కొన్నిరకాల జీవాల మనుగడే మాయమైపోయింది.

సముద్రాల్లో చేరే కలుషాల్లో 90శాతం నదులు తీసుకువచ్చినవే. మిగిలిన 10 శాతం గాలి, వాన, భూకంపాలు తదితర కారణాల వల్ల ఏర్పడ్డాయి. 1050కిలోమీటర్ల తమిళనాడు, పాండిచ్చేరి తీరాలు వస్త్ర, రసాయన, సిమెంట్, పంచదార తదితర పరిశ్రమల వల్ల కలుషితం అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 980 కిలోమీటర్ల దూరం ముఖ్యంగా విశాఖపట్టణం, కాకినాడ షిప్పింగ్ ట్రాఫిక్‌ల వల్ల సముద్రం కాలుష్యానికి గురి అవుతోంది.

ఒరిస్సా, బెంగాల్ తీర ప్రాంతాల పరిస్థితి ఏమాత్రం మెరుగ్గాలేదు. సముద్రంలో జరుగుతున్న ఇంధన కాలుష్య ప్రమాదాలు ఎన్నెన్నో. 1997 జూలై 2న జపాన్‌లోని టోక్యోలోని టోక్యోఖాతంలో 'డైమండ్‌గ్రేస్' అనే సూపర్ ట్యాంకర్ 15,000 కిలో లీటర్ల క్రూడ్ ఆయిల్‌ను తీసుకు వెడుతూ ప్రమాదానికి లోనయింది. దానితో ఈ సముద్ర జలాలు విషపూరితమయ్యాయి. దీనిని అత్యంత తీవ్రమైన దుర్ఘటనగా వర్ణించారు.

ఈ విధంగా తరచు సముద్రజలాలు కలుషితం అవుతూనే వున్నాయి. 1997 జనవరిలో రష్యన్ ట్యాంకర్ ప్రమాదానికి గురై 6,000 కిలోలీటర్ల ఇంధనాన్ని జలమయం చేసి సముద్రజలాలను కలుషితం చేసింది.

మనదేశంలో కూడా 1997 ఆగస్టు 16న ముంబాయిలో కార్గోవాహనం ప్రమాదానికి లోనై 124 మెట్రిక్ టన్నుల హెవీ ఆయిల్, 45 టన్నుల డీసెల్, 15,217 టన్నులు బల్క్ సల్ఫర్‌ను సముద్రజలాల్లో వదిలేసి ఎంతో కాలుష్యాన్ని సృష్టించాయి.

ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బలమైన ట్యాంకులున్న ఓడలు నిర్మించాలి. ఓడలు పగిలినపుడు ముందుగా ఇంధనం వున్న టాంక్ పగుళ్లను మూసివేయాలి.

బహుళ దేశాల పారిశ్రామిక సంస్థలు ఏమాత్రం అవకాశం వున్నా జలకాలుష్యానికి దోహదం చేస్తూనే వున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. చమురు శుద్ధి కర్మాగారాల్ని, ఎరువుల పరిశ్రమల్ని, కాగితం గుజ్జు యూనిట్లను స్థాపించడం కోసం తీరప్రాంతాలను ఎన్నుకుంటున్నారు.

ఇలా ఎన్నుకోవడంలో హానికరమైన రసాయన కాలుష్యాన్ని నేరుగా సాగరాలలోకి వదిలేసి ఏమీ తెలియనట్లు ఈ సంస్థలు మౌనంగా ఉంటున్నాయని పలువురు దుయ్యబడుతున్నారు. అమెరికాలో ఇటువంటి సంస్థల పుణ్యమా అని ఎన్నో తీర ప్రాంతాలలోని బీచ్ రిసార్టులు మూత పడ్డాయి. ఒడ్డుకు కొట్టుకు వచ్చిన జలచరాల కళేబరాలు గుట్టలు గుట్టలుగా పేరుకు పోయాయి.

1988లో ఫిలిడెల్ఫియానుంచి హానికరమైన వ్యర్థ రసాయనాలను సముద్రంలో సుదూరంగా ముంచి వేయాలని 'ఖియాన్ సేన్' అనే నౌక బయలుదేరింది. ఈ దురాగతాన్ని చాలా దేశాలు వ్యతిరేకించాయి. చివరకు ఈ నౌక హిందూ మహా సముద్రంలో ఈ ప్రాణాంతక రసాయనాలను వదిలేసింది.

**మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది**

కాలుష్యం మనిషి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. అన్ని కాలుష్యాలలో జలకాలుష్యం మనిషి ఆరోగ్యానికి పెద్ద బెడదగా తయారయింది. ప్రకృతిలో లభించే పదార్థాలలో గాలి తరువాత మనిషికి కావలసింది నీరు.

భూజలాల కలుషితం యాదృచ్ఛికంగా గాని, సహజంగా గాని జరగవచ్చు. అతి వృష్టివల్ల వర్షపు నీరు భూమి పొరల ద్వారా బావులలోకి చొచ్చుకుని పోయి తాగేనీటిని కలుషితం చేస్తుంది.

క్రిమి సంహారక మందులు, ఎరువులు ఒక క్రమ పద్ధతిలో వాడక పోవడం వల్ల అవి నీటిని కలుషితం చేస్తున్నాయి. భూగర్భంలో నిర్మించిన మురుగు నీటికాలువలు, నూనె గొట్టాలు బద్దలయినపుడు, రైలు, రోడ్డు ప్రమాదాల వల్ల వెలువడే ప్రమాదకరమైన నూనెల వల్లా, ఆమ్ల క్షార సంబంధమైన పదార్థాల వల్ల జలకాలుష్యం పెరుగుతోంది.

నీటిలో మల, మూత్రాలు విసర్జించడం వల్ల టైఫాయిడ్, పారాటైఫాయిడ్, డయేరియా, కలరా, ఫైలేరియాసిస్, కామెర్లు వంటి జబ్బులు వస్తాయి.

నీటిలో ఆక్సిజన్ గాఢత తగ్గడం వల్ల చేపలు, నత్తలు మరణిస్తాయి. బ్యాక్టీరియా వల్ల చేపలు, గొర్రెలు చనిపోవడం, భారీ లోహ అణువుల వల్ల జీవరాశి మెదడు దెబ్బతినడం, క్రిమి సంహారక మందుల కాలుష్యం వల్ల నాడీ మండల చురుకుదనం తగ్గి వ్యాధులు అనేకం వస్తాయి.

కొన్ని సులువయిన మార్గాల వల్ల జలకాలుష్యాన్ని పోగొట్టవచ్చు. దీనికి ప్రజల సహకారం ఎంతో అవసరం. జలాశయాలు, కాలువలు, నదుల సమీపంలో స్నానం చేయడం, గుడ్డలు ఉతకడం, పశువులను తోలడం, మలమూత్రాలును విసర్జించడం వంటి పనులు చేయకూడదు.

గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రతియింటికి మురుగుదొడ్డి సౌకర్యం చేసుకోవాలి. సెప్టిక్ మరుగుదొడ్లు మంచివి. అన్ని ప్రాంతాలలోను రక్షిత మంచినీటి పథకాలు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రణాళికలు చేపట్టాలి.

బ్లీచింగ్ పౌడరు తాగే నీటిలో కలిపి ఆనీటిని ప్రజలకు సరఫరా చేయాలి. ఇళ్ళల్లో ఉండే సొంత నూతుల్లో బ్లీచింగ్ పౌడరు కలుపుకోవాలి.

పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలను నీటిలోని యథాతథంగా వదలకుండా, వాటిని శుభ్రపరచి వాతావరణ, జల కాలుష్యాలు జరగకుండా ఉండే మార్గాలు ఆలోచించాల్సిన బాధ్యత పరిశ్రమల యాజమాన్యం స్వీకరించాలి. ఇళ్ళల్లో తాగేనీటిని శుభ్రపరచే ఫిల్టర్లు వాడుకోవడం మంచిది.

**మూఢనమ్మకాలు పోగొట్టాలి**

తరతరాలుగా ప్రజలలో పాతుకు పోయివున్న మూఢనమ్మకాలు నిర్మూలించేందుకు జలకాలుష్యానికి సంబంధించిన విజ్ఞానం వారికి అందించాలి. నది ఒడ్డున చితులు, కాష్టాలు,

కర్మకాండలు జరగకుండా విద్యుత్ దహనవాటికల ద్వారా మృత దేహాలను దహనం చేసే పద్ధతి ప్రజల్లో బాగా ప్రచారం చేయాలి.

రద్దు పదార్థాలు, వ్యర్థ పదార్థాలు ధ్వంసం చేసినపుడు అతి సూక్ష్మ పరిమాణంలో ఉండే రేణువులు, నైట్రోజన్ ఆక్సైడ్‌లు వెలువడుతాయి. దహన క్రియ సంపూర్తిగా జరిగితే పై పదార్థాలకు తోడుగా కార్బన్ మోనాక్సైడు కూడా చేరుతుంది.

రైళ్ళు, కార్లు, ట్రక్కులు, విమానాలు వంటివి ఇంధన దహన ప్రక్రియలో హైడ్రోకార్బన్‌లు, కార్బన్‌మోనాక్సైడ్, సీసం నైట్రోజన్ ఆక్సైడ్‌ల వంటి పదార్థాలను గాలిలోకి చేరుస్తాయి.

ఫ్యాక్టరీ పొగగొట్టాలనుంచి వ్యర్థ వాయువులు పొగరూపంలో వాతావరణంలో ప్రవేశిస్తాయి. ఈ పొగలో మసి కణాలు ఉంటాయి. కణాలు సూక్ష్మ పరిమాణంలో ఉండడం వల్ల వాతావరణం పొగమంచును ఏర్పరుస్తాయి.

గాలిలోని నీటి ఆవిరి ద్రవీకరించేందుకు ఈ కణాలు కేంద్రకాలుగా ఉపయోగపడతాయి. ఈ పొగమంచు బరువుగా ఉండడం వల్ల భూమిని అంటి పెట్టుకుని ఉంటుంది.

గాలిలో ఏర్పడ్డ కాలుష్యాలను వాతావరణ ఉపరిభాగానికి వెళ్లకుండా ఈ పొగమంచు అడ్డుకుంటుంది. దాని కారణంగా ప్రజలు తప్పనిసరిగా కలుషిత గాలులను పీల్చవలసి వస్తుంది.

కాలుష్య గాలుల తాకిడికి మనిషి కళ్ళు నొప్పి పెట్టి మంటగా వున్నట్లు అన్పించి నీళ్ళుకారుతాయి. ఈ గాలులు పీల్చడం వల్ల దగ్గు, రొంపవంటి మామూలు రుగ్మతలేగాక కొన్ని ప్రమాదకరమైన వ్యాధులు రావచ్చు. కార్బన్ మోనాక్సైడ్ వాయువు వాతావరణంలో కలియడం వల్ల ఆ వాయువు పీలిస్తే మనిషి మేధ చురుకు దనం క్రమంగా తగ్గి పోతుంది.

**నివారణ మార్గాలు**

వ్యర్థ వాయువులు, రద్దు పదార్థాలను కలుషితంగా వదలి వేయడం కన్నా వాటిని కూడా ఉపయోగ కరమైన పదార్థాలుగా మార్పు చెందించే ప్రక్రియలను ఫ్యాక్టరీలు నెలకొల్పాలి.

పారిశ్రామిక వాడలలో నివసించే జనసాంద్రతకు గరిష్ట పరిమితిని నిర్ణయించాలి. పరిశ్రమలు విడుదల చేసే కలుషిత వాయువులకు గరిష్ట పరిమితి నిర్ణయించాలి. దానిని అధిగమించిన యాజమాన్యాలకు జరిమానాలు విధించాలి.

పరిశ్రమలలో వాడే ఇంధనాలకు బదులుగా తక్కువ రద్దును వెలువరిచే ఇంధనాలు అన్వేషించాలి. వాహనాలన్నీ విద్యుత్‌తో నడిస్తే కాలుష్య ప్రమాదం తగ్గుతుంది.

సౌర శక్తిని ఉపయోగించుకుని పరిశ్రమలు నడిపే రోజు వస్తే ఈ వాతావరణ కాలుష్యానికి పెద్ద పరిష్కార మార్గం లభించినట్లవుతుంది.

ప్రజలలో ఉదాసీనత పోవాలి. ఇది ఎవరి సమస్యోనని తటస్థంగా ఉండకూడదు.

(ఈ వ్యాసం ఆకాశవాణి, విశాఖపట్టణం కేంద్రం ద్వారా ప్రసారితమైంది)

# సమసమాజం గురించి

- డా॥ సర్దేశాయి తిరుమలరావు

(గత సంచిక తరువాయి)

హిందూ సంఘంలో అన్ని ఆర్థిక పరిస్థితులకు మగవాడు బానిస. ఆడ మగవానికి బానిస. హిందూ స్త్రీని దాసదాసి అని పిల్చుట యుక్తంగా ఉంటుంది. పొలం, ఇల్లు, స్థిరాస్తియైతే, సొమ్ములూ, ఆ సొమ్ములు తొడిగియుండే ఆడుది చరాస్తి. మొరార్జీ దేశాయ్‌గారి గోల్డ్ కంట్రోల్ ఆర్డరుకు అతీతమైన నగలు కల స్త్రీ, ఆస్తికాక మరేమిటి? అన్ని ఆస్తులవలెనే స్త్రీని అమ్మవచ్చును, కొనవచ్చును, జూదంలో ఒడ్డవచును, ఓడవచ్చును- తాకట్టులో పెట్టవచ్చును- విడిపించుకోవచ్చును. గృహిణీం గృహముచ్యతే అనే నీతిలో కూడ గృహిణి ఆస్తి అనే భావం ఇమిడి వుంది. భారత నారీ గౌరవ గాథలన్నీ అనర్థదాయకాలు. అవి జరిగింది నుల్లక. కానీ నిజంగా వుండే వాళ్ళకి శాశ్వత పీడగా పరిణమించినాయి. సీత, సావిత్రి వంటి రాజరకపు స్త్రీలను ఆదర్శంగా తీసుకొండని చెప్పి సామాన్య స్త్రీ జీవితాలని చట్టుబండలు చేసినాయి మన శాస్త్రాలు. మగవాళ్ల ఇక్కట్ల కన్నిటికీ ఆడుదానిని పాపాల భైరవిగా వర్ణించినాయి పురాణాలు. అన్ని దుఃఖాలకు స్త్రీయే మూలకందమని గ్రంథాలు ఘోషిస్తున్నాయి.

పురుషులేల కాకూడదు? స్త్రీ కావలెను. తత్ఫలితాలు మాత్రం వద్దు. సంసారం వద్దు అని పెండ్లి చేసుకోకుండానే వున్నవాళ్ల సంగతి అటుంచుదాం. చేసుకొన్న పెండ్లాం వద్దు. ఇదుగో సన్యసిస్తున్నాను అని మట్టగోచి పెట్టుకొని పోయిన బాధ్యతారహిత వ్యక్తులని గొప్ప స్వాములుగా మారుస్తున్నారు. ''కిం సారం సంసారం'', ''సదా మోహాట వ్యా చరిత'', ''సంసారం సాగరం దుఃఖం'' ఒహో ఈ సమాస విలసనానికి హద్దూపద్దూలేదు. * ''ఎంత నేర్చిన, ఎంతవారలైనా కాంతసులే'' అని ఒకాయన మగవారిని ఎత్తిపొడుస్తాడు. దీనికి ''విమోన్ లిబ్బరు''లు, ''ఎంత నేర్చినా, ఎంతవారలైనా కాంతా దాస్యమేనా'' అని తిరిగి ఎత్తి పొడువవలెను.

మిమ్మల్ని పెళ్లిచేసుకొండని ఎవరన్నారు? సంసారాన్ని, మమ్మల్ని ''జోరు'' చేయుడని ఎవరన్నారు? కాంతా కనకాలను అనుప్రాసతో ఈసడించినారు. ఇంగ్లీషులో ఈ అనుప్రాస ఇంకా బాగుంటుంది. Wealth, Women, Wine అని. ఎట్టివారు ఈసడించినారు? ఇవి ఎక్కువై మొగం మొత్తినవారు, అని తక్కువై అలమటించిపోయేవారు. (ఈ ద్రాక్షలు తప్పక పుల్లగుంటాయి'' అనే నక్క బావ నైరాశ్యం అనుసరించి) కాంతా కనకాలు స్వంత ఆస్తులుగ అనుకొన్నందువల్ల ''అంతవేదాంతు'' లకు ప్రీతికరమైన ఈ విరక్తి కలుగుతుంది. కాంత ఒక వ్యక్తి అనీ, కనకం కొన్ని

---

* లక్ష్మీ నృసింహకరావలంబ స్తోత్రంలో ఏర్చికూర్చిన పదజాలంలో సంసారాన్ని దుయ్యబట్టినవాడు బ్రహ్మచారి అయిన ఆదిశంకరుడు పై స్తోత్రంలోని కొన్ని శ్లోకారంభాలు చూడండి. సంసార ...........సాగర ఘోర................ సంసార మాప............... సంసార భీకర............ సంసార సర్ప ...................... సంసార జార .............. సంసార వృక్ష ...................... సంసారదాన...............................

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, ప్రముఖ సాహిత్య విమర్శకులు, (1928 - 1994)

పరిశ్రమలకూ రసాయనాలకూ పనికి వచ్చేధాతువనీ తెలివిడి వస్తే ఈ వెర్రి వేదాంతమంతమవుతుంది. సంసారులే కాక సంసారం లేనివాళ్లు కూడా స్త్రీ నిందకులే.

కుడుచుట కట్టుట పూయుట
తొడుగుటయును వివిధ ధన తతులుగూడుటయె
క్కుడు వేడ్క సేయజాలవు
పడతికి బరపురుషగవయబాయుట వోలెన్

(అనుశా. స. అశ్వా 2, ప. 177)

అనేది భీష్ముడు మరణశయ్య మీది నుండి ధర్మరాజుకు చేసిన బోధనలలో ఒకటి. అంకు స్త్రీ నైజమని దీని తాత్పర్యం. ''హంస విధౌతి'', ''శుకసప్తతి'' మున్నగు గ్రంథాలు కూడా ఇదే భావాన్ని విశదీకరించేందుకు ''అతరసాలు'' పూరించే కథలల్లినాయి. ధర్మరాజుకుగానీ, భీష్మబ్రహ్మచారికిగాని స్త్రీయంటే సద్భావంలేదు. కనుక చెప్పేవానికీ, వినేవానికి బాగా కుదిరిందిచ్చట. వీరిని సైకో అనాలిసిస్ చేస్తే వారు Orestes Complex (అంతరంగంలో మాతృ ద్వేషం కల్గి ఉన్నారని తేలుతుంది. ఆదిశంకరుల సంగతి వేఱు. తల్లిని ''మోసం'' చేసి guilty conscience కలవాడు. అందుకే ''చెడ్డ కొడుకంటూ ఉంటాడేమోకానీ చెడ్డతల్లి అంటూ ఉండదు''. (కుపుత్రోక్వచిదపి భవతి, కుమాతానభవతి) అనే మకుటంతో స్తోత్రం వ్రాసి చేయిదులుపుకొన్నాడు.

ప్రద్వేషిణి (ఈమె పేరు చూడండి ఎంత దురుద్దేశపూర్వకంగా ఉందో) దీర్ఘతముని భార్య. ఇతడు పుట్టుగ్రుడ్డి, ముదుకడు. ఇతనిని భార్యేపోషిస్తూ వుంటుంది. ఎట్లా అని అడుగకండి. పైగా పెద్దకుటుంబం. ఇతడు భార్యతో ''నన్నేల మెచ్చవు?'' అని అడుగుతాడు. దానికామె ''భరించేవాడు భర్త. భరింపబడేది భార్య. అయితే ఈ రెండూ మన విషయములో ఉల్టా సీదా అయినాయి. ఎక్కడికైనా పొండి'' అని అంటుంది.

''అనిన నిర్ణయాత్మలని దీర్ఘతము డల్గి
సతులకెల్ల నపుడు శాపమిచ్చె
పతిహీనలయిన భామిను
లతిధనవత్తులయ్యు గులజలయ్యునునవలం
కృతలయ్యేడు మాంగల్యర
హితలయ్యేడు గృపణవృత్తినిదియు మొదలుగాన్''

మహాభా. ఆదిప. ఆ4. ప 28 - 29

తన భార్యమీది కోపాన్ని లోకంలో వుండే స్త్రీలందరిపైనా, అన్ని కాలాల్లోనూ చూపించవలెనా?

ధర్మరాజేమి తక్కువ తిన్నాడా? తల్లి, కన్నెపిల్లగా ఉన్నప్పుడు తప్పుచేసింది కర్ణుడు పుట్టినాడు. ఈ సంగతి ఆమె ధర్మరాజుకు సకాలంలో చెప్పలేదు కాబట్టి కర్ణుణ్ణి పాండవులు చంపినారు. ఈ ఘోరానికి ధర్మరాజు చాల బాధపడతాడు. ఇంత వరకూ బాగుంది. తర్వాత ఈ విషయం రహస్యంగాఎందుకుంచినావు, రహస్యాన్ని దాచి వున్నందునకదా ''యింతపుట్టె'' అని పలికి అక్కడికినిలువక,

అంగనాజనమ్ములకు రహస్యరక్ష
ణంబు నందలి శక్తి మనంబులందు
గలుగకుండెడు మెల్లలోకముల ననిశ
పించెనా ధర్మదేవతాసుతుండు.

(మహాభా. శాంతి ప. ఆ. ప41)

స్త్రీలకింక మీద నోట్లో నువ్వు గింజ వేస్తే నానేకన్నా ముందే వాళ్లు తమకు తెలిసింది ఇంకొకరికి చెబుతారుగాక అని శాపమిస్తాడు ధర్మదేవతా సుతుడు. ఇటువంటి స్త్రీలు, తమవారికీ, సంఘానికీ దేశానికీ న్యూసెన్సు అవుతారనే దూరదృష్టి ఈయనకు లేదు.

స్త్రీలూ, సమాన ప్రతిపత్తిగల వ్యక్తులనీ, విశ్వసనీయులనీ భాధ్యతాయుతులనీ మన పెద్దలు భావించలేదు. స్త్రీలు రెండవ తరగతి పౌరులుగా పరిగణింపబడ్డారు. వాళ్ళగురించి పెద్దలు ఒక విధమైన ప్రోత్సాహక బుద్ధి (Patronizing attitude)తో వ్యవహరించినారు. వారిని పూజించనైనా పూజించండని మనువు అంటాడు కానీ ఆమెకు స్వాతంత్ర్యమీయడు. తండ్రి, మగడు, కొడుకు ఎవరి పంచనో పడివుండమంటాడు. పైగా అనుమానస్థుడు, తల్లితోగానీ, సోదరితోగానీ, బిడ్డతోగానీ ఏకాంతంగా కూర్చోవద్దు, ఇంద్రియాలు బలవంతాలు అంటాడు. మన వాళ్లు స్త్రీని స్త్రీగా చూడరు. పనుల్లో దాసివలె, సలహాయిచ్చే దాంట్లో మంత్రివలె, వడ్డించేటపుడు తల్లివలె, మటొక సమయంలో రంభవలె అవతారం ఎత్తుమంటారు స్త్రీని. కన్నుదోయికి నన్య కాంతలడ్డమైన మాతృభావన చేసి మరలు వాడట ప్రహ్లాదుడు. పైకి మాత వంటిది, కాని ఆలోచిస్తే అశ్లీలమైన అర్థం వస్తుంది. అన్యకాంత తన తండ్రికి భార్యగా వుండవలెనని దీని అర్థం. అన్యకాంత అడ్డమైతే ఈమె అన్యకాంతలే అని మరల కూడదా?

తల్లిగా కాక అన్యస్త్రీగా గౌరవనీయ కానేకాదా? స్వంత ఆస్తిలో స్త్రీ ఒక భాగంగా పరిగణింపబడే వఱకు స్త్రీ ప్రతి పత్తి బానిసత్వంగానే, ఆస్తిలో ఒక భాగంగానే ఉంటుంది. స్త్రీ లైంగిక జలదారిగానే పరిగణింపబడుతుంది. స్త్రీ గడప చాపగానే పరిగణింపబడుతుంది. స్వ లాభాన్ని దోచుకొనే ఆర్థిక వ్యవస్థలో అన్ని పతినియమాలూ స్వంత ఆస్తి పరిరక్షణ చుట్టూ అల్లబడియుంటాయి. భార్య పేరుతో ఆస్తి వ్రాస్తారు. స్త్రీయంటే కనికరంవల్లకాదండి. భార్య = ఆస్తికాబట్టి. అదే కాకుండా, ఏడేడు జన్మాలకీ నీవే పతివి అని ఆమె వ్రతాలు, నోములు చేస్తుంటుంది కదూ? ఇక ఆస్తికి ఢోకాలేదు. ఆస్తి అడ్డరాటం అయిందా, భార్యకూడ విసర్జనీయమాలిన్యం వలె అవుతుంది? 1970లలో భూపరిమితి చట్టం అమలులో వచ్చినపుడు. ఉన్న భూమిని కుటుంబానికి దక్కించుకొనేందుకు. భూస్వాములైన భర్తలు భార్యలకు ఉత్తుత్తి విడాకులిచ్చి దాని వల్ల పర్యవసించిన రెండు కుటుంబాలకు సరిపోయే భూమిని ఉంచుకొన్నారు. భార్యనూ ''ఉంచు''కొన్నారు. ఈ మాజీ భార్య ఆస్తికోసం ఉంపుడు కత్తెగా ఉండటానికంగీకరించిందన్న మాట! ఇదీ స్వంత ఆస్తిలోని నీతి సారం. ఆస్తి వ్యవస్థపోతే, ఇప్పుడు మనం సుగుణాలుగా, ధర్మాలుగా, నీతులుగా ఎంచే ఎన్నో చప్పున అంతరిస్తాయి.

ఉదాహరణకు : దానధర్మాలు, త్యాగం, పరోపకారం, యుద్ధవీరం, దయ, పొదుపు, కర్మ, భయభక్తులు, పుణ్యపాపాలు.

ఆస్తి వ్యవస్థపోయి సమసమాజం వస్తే ప్రాముఖ్యం వహించే సుగుణాలు: మానవత, అహింస,

సహకారం, సమత, స్వతంత్రత, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, అంగడి మెచ్చం బెట్టని కళాభిరతి, శ్రమవీరం, సహానుభూతి, ప్రవర్తనా నియమావళి, పాలనాతత్పరత.

ఆర్థికమైన మిట్టపల్లాలు పోయేదెట్లా? స్త్రీల దుర్గతి బాసేదెట్లా ?

ఆర్థికమైన మిట్టపల్లాలు, ఒక రాబిన్‌హుడ్, ఒక సర్వాయి పాపడు, ఒక ''అగ్గిరాముడు''ల సాహస కృత్యాలతో పోవు. స్త్రీల దుర్గతి ''శశాంక విజయం'' లోని తార, చలం హీరోయినుల ''లేచి పోవడాల'' వలన సమసిపోదు.

పరిమితి వనరులను సమష్టిగా అనుభవించే వ్యవస్థలోనే ఇది సాధ్యం.

పరిమిత వనరులను ఏ పద్ధతిలో సంబాళించుకోవలెను? ఏ పంపిణీ విధానం మంచిది? వనరులను పంపిణీ చేసేందుకు ఏడు విధానాలున్నాయని బెర్నార్డ్‌షా, బుద్ధిమంతురాలికై వ్రాసిన పుస్తకంలో వివరించినాడు.

దిగువ పట్టికలో ఏడు పద్ధతులూ, వాటికి అభ్యంతరాలూ ఇవ్వబడినవి. తుదకు సమసమాజ అంటే సోషలిస్టు పద్ధతే వరణీయం అని నిర్ధారింపబడినది :

## వనరుల పంపిణీ

| సంఖ్య | పద్ధతి | అభ్యంతరం |
|---|---|---|
| 1. | ఎవరు ఎంత ఉత్పత్తి చేస్తారో వారి కది ఇచ్చి వేయుట | ఇది పిచ్చి పద్ధతి |
| 2. | ప్రతి ఒక్కరికీ వానియోగ్యత మేరకు ఇచ్చుట | యోగ్యత నిర్ణయించే దెవరు |
| 3. | ఎవరెంతదక్కించుకొంటే వారికది ఉండిపోవడం | సాదులు పేదవారల సంగతేమి కావలెను. |
| 4. | ఒకనికి ఎక్కువిచ్చి, తతిమ్మా వాళ్ళకి బ్రతుకడానికి బొటాబొటి సరిపోయేంత ఉండనిచ్చుకోవడం | ఇప్పుడున్న పరిస్థితి ఇదే. దీనిని మార్చవలెననే కదా మన ఆశయం |
| 5. | అందరూ పనిచేయవలసిందే కాని వివిధ వర్గాలకు వివిధ రీతుల పంపిణీ చేయవలె. | ఇది వర్గ అసమానతలకు దారి తీస్తుంది. |
| 6. | స్వేఛ్ఛావిపణి (Laissezfaire) | ఇది పెట్టుబడిదారితనం. స్వంత ఆస్తి విధానం |
| 7. | ''సోషలిజం'' = సమ సమాజం | నిరభ్యంతరకరం |

మొట్టమొదటి ఆధునిక సోషలిస్టు ఫ్రెంచి వాడైన బాబీఫ్ (1796) హింస ద్వారా అధికారం చేజిక్కించుకోవడం, రహస్యమంతనాలూ, తక్కువ సంఖ్యలోగల విప్లవికులు ప్రభుత్వాన్ని నడుపడం మున్నగు విధానాలు రూపొందించిందితడే. మార్క్స్ - ఏంగెల్స్ - లెనిన్ - స్టాలినులు ఇతని విధానాలనే అనుసరించినారు. సోషలిజం అనే మాట 1830లలో ఫ్రాన్సులో చలామణిలోకి వచ్చింది. ఫ్రాన్సులో సైంట్ సైమన్, చార్లెస్ ఫౌరియరు అనే వార్ల మౌలిక భావాలు సోషలిజంకు ఆధారాలు. ఫౌరియరు సోషలిస్టు స్వప్నం ఎంత ఆకర్షకం అంటే సోషలిస్టు వ్యవస్థలో ఉప్పునీటి సముద్రం నారింజ రసం అవుతుందట. పులి, సింహం మొదలైన క్రూర మృగాలు సైతం మానవునికి తోడ్పడతాయి అంటాడు.

ఇతని సోషలిస్టు వ్యవస్థ మహాభారతంలోని కణ్వాశ్రమం బోలి వుంటుందని మనం భావించుకోవచ్చు. వీరికి దాదాపు సమకాలికుడు రాబర్టు ఓవేన్ అనే ఇంగ్లీషు పారిశ్రామిక వేత్త. ఆచరణ సాధ్యమైన సోషలిస్టు సూత్రాలని చేయడమేకాక, వాటిని తన నూలు మిల్లులలో కార్మికులు యోగక్షేమాలకై అనువర్తించచేసినాడు. జర్మన్ ఆదర్శవాదాన్నే, బ్రిటిష్ ఆర్థిక శాస్త్రాన్నీ, ఫ్రెంచి సోషలిజాన్నీ సమ్మిళితం చేసి మార్క్సు శాస్త్రీయ సోషలిజంను ప్రతిపాదించినాడు. సోషలిజంలో చాలా ''బ్రాండు'' లున్నాయి. మోర్ యొక్క అతల సోషలిజం, సైంటు సైమన్ ఆలోచనాత్మక సోషలిజం, ఫొరియరు కమ్యూనిజం, ఓవెన్ ఆచరణాత్మక సోషలిజం, మార్క్సు శాస్త్రీయ సోషలిజం, చార్లెస్ గింగ్సులే క్రైస్తవ సోషలిజం, ఫేబియస్ సోషలిజం, కోల్ యొక్క గిల్డు సోషలిజం, హిట్లరు బ్రాండు నేషనల్ సోషలిజం, మన దేశంలో గాంధీ సోషలిజం, మానవేంద్రనాథరాయ్ నవీన మానవీయ సోషలిజం.

ఇంతకీ సోషలిజం అంటే ఏమిటి అనే ప్రశ్న మిగిలి పోయింది. సోషలిజం అంటే:.

1. సర్వసమానత. ఇదికాక పోతే సోషలిజం మరేమి కాదు అంటాడు షా.

2. ఒక విలువ.

3. పరిమిత వనరులను సర్వజన హితానికీ, సర్వజన సుఖానికీ ( బహుజన హితాయ, బహుజన సుఖాయ' కాదు) తార్కికంగా, శాస్త్రీయంగా వినియోగించడం.

4. స్వంత ఆస్తి పద్ధతి లేకుండుట.

5. అందరికీ సమానావకాశాలుండడమే కాకుండా ఆ అవకాశాలను ఉపయోగించుకొనే వాతావరణాన్ని కల్గించే పద్ధతి.

సమసమాజం ఏర్పడితే జీవిత మెట్లుంటుంది అనే ప్రశ్న వస్తుంది. ముఖ్యంగా మధ్య తరగతి మనస్కతకలవారికి సమ సమాజమన్నా, విప్లవమన్నా భయాందోళనలు కల్గుతాయి. ధనవంతునికి తెలుసు. తన ధనమంతా ఎప్పుడో ఒకప్పుడు ఊడ్చుకుపోతుందని. వాడు విప్లవానికి సిద్ధమై కూర్చున్నాడు. పేదవాడన్నామా? వాడు పోగొట్టుకొనేదేముంది - సంకెళ్లు తప్ప. వాడూ విప్లవం అంటే 'రెడీ' యే. హృదయం ధనం మీదా, కాళ్లు దరిద్రం మీద పెట్టుకొని జీవించే మధ్యమ తరగతివాని పరిస్థితి ఇరకాటంలో పడుతుంది. అన్ని నీతులకూ సంస్కృతులకూ తానే ప్రతీక అనుకుంటాడు మధ్యమ తరగతి మనిషి.

సమసమాజంలో ఎట్లా ఉంటుంది ?

1. స్వంత ఆస్తి పద్ధతి ఉండదు.

2. పొలాలు, ఫ్యాక్టరీలు అందరికీ చెందుతాయి.

3. దినదిన జీవితంలో కార్మికునికీ సమాజ పర్యవేక్షకునికీ ( సమసమాజంలో ప్రభుత్వా సమస్య

ధికారులుండరు. పర్యవేక్షకులుంటారు. వీరికి విధులేకాని అధికారాలుండవు) జీవన స్థాయిలో భేదం వుండదు. కార్మికునికి లేని సౌకర్యం పర్యవేక్షకునికీ ఉండదు.

4. మనిషి తన శక్తిని ఉద్యోగక్రియా తృప్తికీ స్వీయ వ్యక్తిత్వసాధనకీ ఉపయోగిస్తాడు. ధనార్జనకూ, అధికార చెలాయింపుకూ దుర్వినియోగం చేయడు. ఎట్టి ప్రావీణ్యంగల ఘనవ్యక్తి కూడా సామాన్య కార్మికునివలె జీవించవలసిందే.

5. ప్రతి వ్యక్తికీ కష్టంకాని జీవితం గడపడానికి ఏర్పాట్లుంటాయి.

6. సైన్యం ఉండదు. సమసమాజ స్థాపన వసుధైక వ్యవస్థకు ★ దారి తీస్తుంది.

7. పోలీసులు, స్కౌటులూ ఉంటారు. ట్రాఫిక్ కంట్రోలుకూ, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు జనులకు తోడ్పటం, ముసలివాళ్లకూ, పిల్లలకూ, అంగ వికలులకు సహాయం చేయడం వీరిపని.

8. భిక్షాటనం ఉండదు. అంగసౌష్టవం, తగ్గవయసు కలవారికి ఉపాధి ఇవ్వబడుతుంది. ముసలివాళ్లు విశ్రాంతి సదనానికి పంపబడతారు. అంగవికలులు వైద్య హాస్టళ్లకు పంపబడతారు. పసిపిల్లలు కే.జీ.లలో విద్యనేర్చుకొనేందుకు పంపబడతారు. సమసమాజంలో వీరలే ప్రత్యేక హక్కుదారులు. (Privileged classes).

9. ఆకలితో ఎవరూ చచ్చిపోరు. బలవంతానైనా తినిపిస్తారు.

10. సక్రమంగా కానీ, అక్రమంగాకానీ పుట్టిన సంతానాలన్నిటినీ సమాజమే భరిస్తుంది. పోషిస్తుంది. విద్యగరుపుతుంది. ఉద్యోగమిస్తుంది.

11. కుటుంబ పద్ధతి పోతుంది. సహకార జీవనం ఉంటుంది. ఒకే ఇంటిలో వివిధ వర్గాలవారూ, మతాలవారూ సహజీవనం చేస్తుంటారు.

12. స్త్రీకి ఆర్థిక భద్రత, స్వేచ్ఛ ఉన్నందువల్ల, వేశ్యావ్యవస్థ వుండదు.

13. ఏకాంతంలో తన ఆత్మనుగానీ, తన సృష్టికర్తనూ (అటువంటి వాడున్నాడని విశ్వసించే పక్షంలో) ఆరాధించేదే మతంగా ఉంటుంది కాని, బహిరంగ ప్రదర్శనంగా, ఆర్భాటంగా, ఇతరులకు మనో క్షోభ, తొందర కలిగించేదిగా ఉండదు.

14. నిరుద్యోగ సమస్య ఉండదు. ఉన్న ఉద్యోగాల సంఖ్యకు సరిపోయే ఉద్యోగ అభ్యర్థులు లేని ఉంటుంది.

15. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం, బాధను, రోగాన్నీ, అలసటనూ వేసరికమూ తగ్గించేందుకూ,

★ వేదంలోని ''యత్రవిశ్వం భవత్యేక పీడం'', రామాయణం లోని ''వసుధైవకుటుంబకం'', వేమన ''ఉర్విజనులకెల్ల ఒక్క కంచము బెట్టి'', థామస్ పెయిన్ ''ప్రపంచం నా ఇల్లు'', వెండల్ విల్కీ ''ఒక ప్రపంచం'' మున్నగునవి వసుధైక వ్యవస్థ సాధ్యమే అని భరవస ఇస్తున్నాయి.

ఆనందం, సౌకర్యం, ఆరోగ్యం, ఉత్సాహం పెంపొందించేందుకుపయోగింపబడుతుంది. కష్టపు పనులను రోతపు పనులను యంత్రాలేచేస్తాయి. మనిషి ఆనందకర, సృజనాత్మక పనులూ, ప్రణాళికలు మాత్రమే చేస్తాడు.

16. ప్రతివానికి, తన వ్యక్తిత్వంలోని సంపూర్ణ శక్తులను అభివృద్ధి జేసుకొనే నిజమైన పరిస్థితులుంటాయి. ఆ వ్యక్తిత్వం కళ, శాస్త్రం, తత్వం సంబంధికావచ్చు.

17. సమ సమాజంలో అందరూ విరక్తులే. అందరూ కర్మ యోగులే. కర్మలోనేకాని, తత్ఫలితంలో అధికారంలేనివాడు విరాగి, కర్మయోగి.

18. ఏలాగో ఒకలాగు డబ్బువెనుకవేసుకొన్న విరామ వర్గాలుండవు. ప్రయోజనకారిపనులు (కృషి, పరిశ్రమ, కళ, శాస్త్రం, తత్వం, శిక్షణ, ప్రణాళికా రచన) సమాజ పర్యవేక్షణ, చేసే వాళ్లందరికీ తత్తదుచిత విరామం, విశ్రాంతి ఉంటాయి. పని దొంగలుండరు. పని తప్పించుకొనేందుకు జబ్బునటించే మనస్తత్వం ఉండదు.

19. జైళ్లు ఉండవు. కోర్టులుండవు. సివిల్ వ్యాజ్యాలుండవు. పాత వ్యవస్థావాసనవల్ల ఎవరన్నా నేరాలు చేస్తే, వారిని మానసిక వైద్యశాలలకో, సంస్కార శిక్షణాలయాలకో పంపి, సమాజోపకారక సభ్యులుగా చేస్తారు.

మానవుని ఇచ్ఛాశక్తి అంతుపట్టే అంశంకాదు. అన్ని వ్యవస్థలూ, అన్ని విప్లవాలూ, అన్ని మేళ్లూ మానవుని సంకల్పశక్తి తోనే సంభవిస్తాయి. ఇచ్ఛాశక్తి ఆత్మగతం, మనిషి 'నేను' అనే అంతరంగపు నిలద్రొక్కుకోవడమే ఆత్మ.

ఆత్మ అంటే ఏమో దృష్టాంతాలిస్తాను. ఒక ముసలిదాన్ని ఒక చిన్న పిల్లవాడు చేయిపట్టుకొని రద్దీవుండే రోడ్డు దాటిస్తూండగా, ఆదృశ్యం చూచినప్పుడు మనలోపల నుండి ''ఆ పిల్లవాడు బాగా చేస్తున్నాడు కదూ'' అనే శబ్దం వినవచ్చినట్లు అవుతుందో అదే ఆత్మ. బస్సులో ప్రక్కవాడి మనీ పర్సు జారిపడినప్పుడు దాన్ని తీసి వానికివ్వకుండా మన జేబులో వేసుకొనే ప్రయత్నం చేసేటప్పుడు ''ఏయ్ ఇదివాడిది'' అంటూ మన లోపల నుండి ఏదైతే హెచ్చరించినట్లవుతుందో అది ఆత్మ. ఈ వ్యాసంలో ఉదహరింపబడిన సోక్రటీసు వాఙ్మూలంలో ఆయన Inetrnal Oracle (''అంతరంగ ప్రబోధం'') అని దేన్నంటున్నాడో అదే ఆత్మ. అందుకే ఈ ప్రకరణానికి ''మానవాత్మలో సమసమాజం'' అనే పేరు పెట్టినాను. మానవాత్మ సంకల్పం వల్ల సమసమాజం స్థాపించబడినప్పుడు, అందులోని మానవుని స్థితి ఏలాగుంటుంది అనే విషయం మేధావులెందరో చర్చించినారు. అట్టివారిలో ఆస్కార్‌వైల్డ్ ఒకడు. ఆయన ఇంగ్లీషు భాషలో ''సమసమాజంలో మానవాత్మ'' అనేగొప్పవ్యాసం వ్రాసినాడు. వైల్డ్‌వాడిన Soul పదమే నావ్యాసానికి ప్రేరేపకము. అందులోని 19వ శతాబ్దంలో ఇంగ్లాండులో ఉండే కొన్ని సంగతులు తప్పించి తక్కినదంతా సార్వకాలిక, సార్వదేశీయ భావాలతో నిండి ఉంది. ఆ వ్యాసం నా ప్రకరణానికి భరత వాక్య ప్రాయంగా ఉంటుందని, దానిని అనువదించినాను. పందొమ్మిదవ శతాబ్దం చివరన ఉండే వైల్డ్ భావాలతో, ఇరువదవ శతాబ్దం చివరన ఉండే నా భావాలను జోడించడం, ఈ వ్యాసాదిన హనుమభీముల భావ సంవాదం వలె ఉంటుందని నా ఆశయం. (సశేషం)



**The Little Street (1660)**

Vermeer's two landscape paintings are his most original works, for in them he seems to look with an utterly fresh eye and without any sence of contrivance. This picture is particularly loved in Holland, where it is called simply the 'Straatje' (the street). The blue - looking foliage has been caused by fading of yellow from the green.

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/20



ఆర్టిస్టు స్టుడియో (1665-70)

తాను చిత్రకారునిగా పనిలో మునిగి ఉన్న భంగిమనే అతడు ఇందులో చిత్రించాడని తరచు అంటూ ఉంటారు. గిల్లి రెచ్చగొట్టే చిక్కుముడిగా ఉన్న తన చిత్రాన్ని అంతగా ప్రసిద్ధం కాని అతడు అలా చిత్రించుకోవడం పరిస్థితుల కనుగుణంగానే ఉంది. ఈ చిత్రాన్ని కొనుక్కున్న ఒక కుటుంబం నుంచి హిట్లర్ బలవంతాన లాక్కొన్నాడు. ఈ చిత్రం ఆస్ట్రియా సాల్ట్‌మైన్ నుంచి 1945లో తిరిగి కనుగొన్న అనేక చిత్రాల మధ్య పడి ఉంది.